# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక :270 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి మంగళవారం 6 అక్టోబర్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE :270 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI TUE 6 OCTOBER 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur




## అంబటి రాంబాబుకు కిర్లంపూడి పోలీసుల నోటీసులు

- ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల ఘటనపై విచారణ
- ఈ నెల 8న హాజరు కావాలని నోటీసుల్లో వెల్లడి
- వేరే పనులున్నాయని, మరో తేదీ చెబుతానని అంబటి సమాధానం

పెన్ పవర్ డెస్క్:వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు పోలీసులు సోమవారం నోటీసులు జారీ చేశారు.

- మిగతా 2లో




# ఇంటింటికీ జలధార..

## రూ.30,156 కోట్లతో బృహత్ పథకం ప్రారంభించిన చంద్రబాబు, పవన్

- ప్రొద్దుటూరులో 'అమరజీవి జలధార' పనులకు శ్రీకారం
- రూ.30,156 కోట్లతో 27 లక్షల కుటుంబాలకు సురక్షిత తాగునీరు
- రాయలసీమ రైజింగ్‌ను ఎవరూ అడ్డుకోలేరన్న చంద్రబాబు
- గోదావరి పుష్కరాల లోపు పోలవరం పూర్తి చేస్తామని హామీ
- గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- గొడ్డలి పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారన్న సీఎం



పెన్ పవర్ డెస్క్:గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జల్ జీవన్ మిషన్ 2.0లో భాగంగా రూ.30,156 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన 'అమరజీవి జలధార' పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం ప్రారంభించారు. కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని కొత్తపల్లిలో వారు పైలాన్‌ను ఆవిష్కరించి ఈ బృహత్ పథకానికి అంకురార్పణ చేశారు.

ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మరో 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు కొత్తగా కుళాయి కనెక్షన్లు అందించనున్నారు. ఇందుకోసం 13,075 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, 77,243 కిలోమీటర్ల పైపులైన్ల విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే రాష్ట్రంలో మొత్తం 3.3 కోట్ల మందికి సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇప్పటికే 62 లక్షల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు

- మిగతా 2లో

# 2029 నాటికి 4-స్టార్..

## ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష.. అధికారులకు కీలక ఆదేశాలు!



- ఏడాదిలోగా వన్-స్టార్ స్కూళ్లను టూ-స్టార్‌గా మార్చాలని ఆదేశం
- 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 4-స్టార్ సదుపాయాల కల్పన లక్ష్యం
- ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయం
- ఏజెన్సీ ప్రాంత పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచన

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయంలో నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా చేరుకోవాలని

- మిగతా 2లో



## రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

- రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదని, అభివృద్ధి అని పవన్ కల్యాణ్ వ్యాఖ్య
- ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో అమరజీవి జలధార పథకానికి శ్రీకారం
- గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసిందని తీవ్ర విమర్శ
- పులివెందుల, అరకులోనూ వివక్ష లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామని వెల్లడి
- ఇది కక్షసాధింపుల ప్రభుత్వం కాదు, ప్రజాభివృద్ధి ప్రభుత్వమని స్పష్టీకరణ

- మిగతా 2లో

## వివేకా హత్య కేసులో జగన్ మౌనం నేరాంగీకారమే

- టికెట్ కోసం రూ.40 కోట్ల సుపారీ ఇచ్చారని జగన్‌పై తీవ్ర ఆరోపణలు
- రాయలసీమ, ప్రకాశం జిల్లాలను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు ప్రణాళికలు
- పల్లె పండుగ 3.0, జలజీవన్ మిషన్‌తో రాష్ట్రంలో అభివృద్ధి పనులు వేగవంతం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ



- మిగతా 2లో

# నిజం బయటపడ్డది..




## సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై రాహుల్ ఫైర్

పెన్ పవర్ డెస్క్: సర్ ప్రక్రియలో అవకతవకలు, ఫారమ్ 6లో మార్పులు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష తీరుపై ఆరోపణలకు సంబంధించి కేంద్ర

- మిగతా 2లో



# 'మా అనుమతి లేదు'..

## ఫారమ్-6పై సుప్రీంకోర్టు షాకింగ్ కామెంట్స్

పెన్ పవర్ డెస్క్:కొత్త ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉపయోగించే ఫారమ్-6లో చేసిన మార్పులపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సవరించిన ఫారమ్-6కు తాము అనుమతి ఇవ్వలేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని పూర్తిగా పరిశీలిస్తామని చెప్పారు.ఫారమ్-6లో అసలు మార్పు జరిగిందా? జరిగితే ఎవరు చేశారు? అనే విషయాలను తేల్చాల్సి ఉందని కోర్టు తెలిపింది. దీనికి సంబంధించిన రికార్డులు తమ ముందుకు వచ్చిన తర్వాతే అంశాన్ని లోతుగా పరిశీలిస్తామని

- మిగతా 2లో

- ఫారమ్-6 మార్పులకు అనుమతి ఇవ్వలేదని సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- మార్పు ఎవరు చేశారో తెలుసుకుంటామన్న సీజేఐ
- రికార్డులు చూశాకే పూర్తిస్థాయి విచారణ ఉంటుందని వెల్లడి
- ఫారమ్-6ను సవరించలేదని ఈసీ స్పష్టీకరణ
- 'సర్' కోసం అదనపు డిక్లరేషన్ మాత్రమే చేర్చామని వెల్లడి



## రేపిస్టులకు భయం పుట్టాలి.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

పెన్ పవర్ డెస్క్:పెరుగుతున్న అత్యాచార ఘటనపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అత్యాచారం చేసే వారికి శిక్షలు మరింత కఠినంగా ఉండాలని .. రేప్ చేయాలం టేనే భయపడి పోవాలని ఢిల్లీ పోలీసులు కీలక ఆదేశాల జారీ చేసింది. ఢిల్లీ ఎన్ సీఆర్ అత్యాచారం కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది.

- మిగతా 2లో




## భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

- భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్దత ఏర్పడిందన్న నిర్మలా సీతారామన్
- ప్రస్తుతం వాణిజ్యం భారత్‌కే అనుకూలంగా ఉందని వెల్లడి
- వాణిజ్య లోటును తగ్గించుకోవాలని అమెరికా భావిస్తోందని వ్యాఖ్య
- ఈయూ ఒప్పందాన్ని విజయవంతమైన ఉదాహరణగా చూపిన ఆర్థిక మంత్రి

పెన్ పవర్ డెస్క్:భారత్, అమెరికాల మధ్య కొంతకాలంగా కొనసాగు తున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతిష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

- మిగతా 2లో

## వైద్య రంగంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్..

## మెదడు రహస్యాలను ఛేదించిన 'ఆప్టోజెనెటిక్స్

- వైద్యశాస్త్రంలో 2026 నోబెల్ బహుమతి ముగ్గురికి సంయుక్తంగా ప్రకటన
- కార్ల్ డీస్సెరోత్, పీటర్ హెగెమాన్, జార్జ్ నాజెల్‌లను వరించిన పురస్కారం
- ఆప్టోజెనెటిక్స్ అనే టెక్నిక్‌ను అభివృద్ధి చేసినందుకు ఈ గౌరవం
- కాంతిని ఉపయోగించి మెదడులోని నరాల కణాలను నియంత్రించడం దీని ప్రత్యేకత
- జ్ఞాపకాలు, భావోద్వేగాలను అర్థం చేసుకోవడంలో ఈ ఆవిష్కరణ ఒక మైలురాయి

- మిగతా 2లో



## ఓటుకు నోటు కేసులో కీలక మలుపు..

## సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్



- ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్
- ఈ కేసులో తనను ఇంప్లీడ్ చేయాలని పిటిషన్ దాఖలు
- బాధితుడిగా తన వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి
- కేసును కొట్టివేయాలన్న రేవంత్ రెడ్డి పిటిషన్‌పై విచారణ వేళ ఈ పరిణామం
- పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం, విచారణ వాయిదా

- మిగతా 2లో




## ఓటుకు నోటు కేసులో కీలక మలుపు.. సుప్రీంకోర్టులో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. 2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తదుపరి విచారణలో ధర్మాసనం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

# నిజం బయటపడ్డది..

- మొదటి పేజి తరువాయి

ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు నోటీసులు ఇవ్వడంపై లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ట్వీట్ చేసిన రాహుల్ గాంధీ.. ఫారమ్ 6లో మార్పులకు ఎటువంటి ఆమోదం తెలపలేదన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ సీఈసీ జ్ఞానేష్ కుమార్?పై ఫైర్ అయ్యారు.

'జ్ఞానేష్ కుమార్ ఫారం 6ను చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారన్నది ఇప్పుడు నిస్సందేహంగా రుజువైంది. బీజేపీకి సహాయం చేయడానికి అతను తన పదవిని దుర్వినియోగం చేస్తున్నాడనడానికి ఇది మరో రుజువు మాత్రమే. మన ప్రజాస్వామ్యంపై జరిగిన ఈ నేరపూరిత దాడిలో పాలుపంచుకున్న జ్ఞానేష్?తో పాటు ప్రతి ఒక్కరూ జవాబుదారీగా ఉంటారు" అని రాహుల్ హెచ్చరించారు. కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు నోటీసులు ఇచ్చిన తర్వాత సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేసింది.

**ఈసీ, కేంద్రానికి సుప్రీం కోర్టు నోటీసులు**

సర్ ప్రక్రియలో అవకతకవలు, ఫారమ్ 6లో మార్పులు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై ఆయనను పదవి నుంచి తొలగించాలని సుప్రీం కోర్టులో పిటిషన్లు దాఖలు అయ్యాయి. అక్టోబర్ 5న ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు.. ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఎన్నికల సంఘంలో మిగిలిన ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

అంతేకాకుండా, ఫామ్ 6 మార్పులకు తాము ఎటువంటి ఆమోదం తెలపలేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఫామ్ 6?లో మార్పులు ఎవరు చేశారో రికార్డులను సమర్పించాలని ఆదేశించింది. దేశంలోవ కోట్ల సంఖ్యలో ఓటర్లను తొలగించారన్న ఆరోపణల వేళ కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేయడం దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## రేపిస్టులకు భయం పుట్టాలి.. సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

- మొదటి పేజి తరువాయి

నేరం పాల్పడే వారి మనసులో చట్టం పట్ల భయాన్ని కలిగించడం అవసరమని కోర్టు తెలిపింది. నేరం చేస్తే ఏం జరుగుతుందో , వాటి పరిణామాలకుభయపడకపోతే, అటువంటి నేరాలను నివారించడం కష్టమని అత్యున్నత న్యాయస్థానం నొక్కి చెప్పింది.

సమాజంలోని ప్రతి మహిళ మన తల్లి, సోదరి వంటిది. మనం వారికి భద్రతా భావాన్ని కల్పించాలి. మనం ఇంట్లో మహిళల భద్రతను ఎలాగైతే నిర్ధారిస్తామో, సమాజంలో కూడా అలాగే చేయాలి. ఒక మహిళ బస్సులో ఒంటరిగా ప్రయాణిస్తుంటే, పోలీసులకు ఆమె గురించి సమాచారం ఉండాలని, ఆమె భద్రతపై చురుకుగా వ్యవహరించాలని కోర్టు పేర్కొంది. ఈ కేసులో తదుపరి విచారణ నవంబర్ 16కు వాయిదా వేసింది.

**నేరాలపై నిఘాకోసం వార్ రూం..**

నేరాల నియంత్రణకు ఓ వార్ రూం ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఢిల్లీపోలీసులను ఆదేశించింది. నేరాలను అరికట్టడంలో ఢిల్లీ పోలీసులు ఏవైనా ప్రత్యేక చర్యలు చేపట్టారా.. వార్ రూం లాంటిది ఏర్పాటు ఏదైనా ఏర్పాటు చేశారా అని పోలీసులను ప్రశ్నించింది. జాతీయ డేటా బేస్ ద్వారా అనుమానిత క్రిమినల్స్, ప్రమేయం ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టాలని అధికారులను కోర్టు కోరింది. మహిళలు, విద్యార్థులనుపదే పదే వేధించే వ్యక్తులు ఉన్నారని, అన్ని ఏజెన్సీలు కలిసి నిఘా ఉంచితే పరిస్థితిని చక్కదిద్ద వచ్చని తెలిపింది. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులకు వార్నింగ్ ఇచ్చింది. విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు 2012 నిర్భయ కేసును కూడా ప్రస్తావించింది. అనుమతి లేకుండా నడుస్తున్న హోటళ్లలో మద్యం కూడా అందిస్తున్న ప్రదేశాలపై దృష్టి సారించాలని కోర్టు ఢిల్లీ పోలీసులను కోరింది. 2012 నాటి ఘటనకు సంబంధించిన రికార్డుల ప్రకారం, నిందితురాలు నేరం చేయడానికి ముందు ఓ ప్రదేశంలో భోజనం , మద్యం సేవించినట్లు కోర్టు పేర్కొంది. ఢిల్లీలోని భద్రతా ఏర్పాట్లపై కూడా కీలక వ్యాఖ్యలు చేసింది. బహిరంగ ప్రదేశాలు, పార్కులలో తగినంత లైటింగ్ ఏర్పాటు చేయాలని సొలిసిటర్ జనరల్ ను కోరింది. క్షేత్రస్థాయిలో పోలీస్ నిఘా, జవాబుదారితనం, నియంత్రణ చర్యల అవసరాన్ని ధర్మాసనం నొక్కిచెప్పింది.

## భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన 'మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్ 2026'లో ఆమె మాట్లాడారు. "వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాలు పట్టుదలగా చర్చలు జరిపాయి. ప్రస్తుతం ఇచ్చిపుచ్చుకునే ధోరణికి అతీతంగా చర్చలను ముందుకు తీసుకెళ్లడం కష్టతరంగా మారింది" అని ఆమె అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలను ఇరుపక్షాలు అన్వేషించవచ్చని సూచించారు. భారత్‌తో వాణిజ్యం వల్ల తమకు ఏళ్లుగా నష్టం జరుగుతోందన్న అమెరికా ఆందోళన ఈ చర్చల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 2026లో ప్రకటించిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ముసాయిదా ప్రాతిపదికన ఈ చర్చలు కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో భారత్–యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ఒక విజయవంతమైన ఉదాహరణగా పేర్కొన్నారు. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ అభివర్ణించినట్లుగా ఇది 'తల్లి లాంటి ఒప్పందం' అని ఆమె కొనియాడారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ 92.5 శాతం టారిఫ్ లైన్లను, 97 శాతం వాణిజ్య విలువను అందుబాటులోకి తెస్తే, ఈయూ తన వైపు నుంచి 97 శాతం టారిఫ్ లైన్లను, 99 శాతం వాణిజ్య విలువను విముక్తం చేసిందని ఆమె వివరించారు.

# ఇంటింటికీ జలధార..

- మొదటి పేజి తరువాయి

ఉండగా, ఈ కొత్త పథకంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

**రాయలసీమ రైజింగ్.. అభివృద్ధి ఆగదు**

ఈ సందర్భంగా ప్రొద్దుటూరులో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. రాయలసీమకు 'రప్పారప్పా' రాజకీయం కాదని, అభివృద్ధి, సంక్షేమం కావాలని స్పష్టం చేశారు. రాయలసీమ అభివృద్ధి బుల్లెట్‌లా దూసుకెళ్తుందని, దానిని ఎవరూ ఆపలేరని అన్నారు. రూ.1 లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేసి సీమ దశ, దిశ మారుస్తామని ప్రకటించారు. భవిష్యత్తులో శత్రు దేశాలను చీల్చిచెండాడే ఫైటర్ జెట్లు 'మేడ్ ఇన్ రాయలసీమ' అని చెప్పుకునే రోజులు వస్తాయని, ఇక్కడ పండే ఫలాలు 'రాయలసీమ బ్రాండ్'తో ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. రానున్న గోదావరి పుష్కరాల లోపే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు.

**గొడ్డలి పార్టీపై తీవ్ర విమర్శలు**

గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు గొడ్డలి పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. వివేకా హత్య కేసు నుంచి మద్యం కుంభకోణం వరకు అన్ని వేళ్లూ ఆ పార్టీ అధినేత వైపే చూపిస్తున్నాయని ఆరోపించారు. కుట్రలు, ఫేక్ ప్రచారమే ఆ పార్టీ సిద్ధాంతమని, వారి డీఎన్ఏలోనే నేరాలు చేసి ఇతరులపై నెట్టేయడం ఉందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష హోదా కోరడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానిక సంస్థల్లోనూ కూటమి అధికారంలో ఉంటే 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్'తో అభివృద్ధి వేగవంతం అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్.సవిత, పి.నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# 2029 నాటికి 4-స్టార్..

- మొదటి పేజి తరువాయి

రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్–స్టార్ పాఠశాలలన్నింటినీ టూ–స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుత విద్యా సంవత్సరంలోగా జీరో–స్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలలన్నింటినీ కనీసం వన్–స్టార్ స్థాయికి చేర్చాలని సూచించారు. 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4–స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, కనీసం వెయ్యి పాఠశాలలను 5–స్టార్ స్థాయికి చేర్చేలా పటిష్ఠ ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 "లీప్ స్కూళ్లను" అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1,685 వన్–స్టార్... 15,618 టూ–స్టార్... 19,099 త్రీ–స్టార్... 7,172 ఫోర్–స్టార్ పాఠశాలలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్‌పీలకు బాధ్యతలు అప్పగించాలని లోకేశ్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున, ఇకపై అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిగా అభ్యసన ఫలితాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

**నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట**

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ద్వారా ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీమ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. నిరుద్యోగ యువతను "నైపుణ్యం పోర్టల్" పరిధిలోకి తీసుకువచ్చి, ఏఐ సాంకేతికత ద్వారా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాలన్నారు. సీడాప్, ఓంక్యాప్‌ల ద్వారా జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణనిచ్చి, విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో మానవ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వివేకా హత్య కేసులో జగన్ మౌనం నేరాంగీకారమే

సొంత బాబాయ్ వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో దర్యాప్తు సంస్థలన్నీ ఆధారాలతో తాడేపల్లి ప్యాలెస్ వైపే చూపిస్తున్నప్పటికీ, మాజీ ముఖ్యమంత్రి జగన్ మౌనం వహించడం ఆయన నేరాన్ని అంగీకరించడమేనని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కడప ఎంపీ టికెట్ కోసం ఏకంగా రూ.40 కోట్ల సుపారీ ఇచ్చి సొంత కుటుంబాన్నే బలితీసుకున్న చరిత్ర జగన్‌ది కాదా అని సూటిగా ప్రశ్నించారు. ఈడీ, సీబీఐ వంటి సంస్థలు దర్యాప్తును వేగవంతం చేస్తుంటే, సమాధానం చెప్పలేక జగన్ ముఖం చాటేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకుని ఈ కేసును నీరుగార్చారని, పులివెందులలోకి కేంద్ర దర్యాప్తు అధికారులు రాకుండా అడ్డుకున్నది వైసీపీ ప్రభుత్వమేనని ఆయన ఆరోపించారు.

**అభివృద్ధి, సంక్షేమంలో కూటమి ప్రభుత్వం పరుగులు**

ఒకవైపు వైసీపీ విధ్వంసకర రాజకీయాలకు పాల్పడుతుంటే, తమ కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగులు పెట్టిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కలిసి 61.60 లక్షల కుళాయిల ద్వారా 27.36 లక్షల కుటుంబాలకు తాగునీరు అందించే 'జలజీవన్ మిషన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. 'పల్లె పండుగ 3.0' కింద రూ.1,185 కోట్లతో సీసీ, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం ముమ్మరంగా సాగుతోందన్నారు. పీఎంఏవై గ్రామీణ్ 2.0 ద్వారా రాష్ట్రంలో రూ.7,170 కోట్లతో పేదలకు మూడు లక్షల పక్కా ఇళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం సెంటున్నర స్థలం పేరుతో భూదందాలకు పాల్పడితే, తాము పారదర్శకంగా సంక్షేమ ఫలాలను అర్హులకు అందిస్తున్నామని స్పష్టం చేశారు.

**రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ**

రాయలసీమ సాగునీటి కష్టాలను తీర్చడానికి ఎన్టీఆర్ హంద్రీ–నీవా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తే, చంద్రబాబు తన పాలనలో నిధులు కేటాయించి కుప్పం వరకు కృష్ణా జలాలను తీసుకువచ్చారని రాంప్రసాద్ రెడ్డి గుర్తుచేశారు. రాయలసీమతో పాటు ప్రకాశం జిల్లాను కలుపుకొని పది జిల్లాలను 'హార్టికల్చర్ హబ్'గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసిందన్నారు. హైదరాబాద్‌లో ఐఎస్‌బీని ఏర్పాటు చేసిన స్ఫూర్తితో, మంత్రి నారా లోకేశ్ చొరవతో దేశంలోనే తొలిసారిగా 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'ను రాష్ట్రానికి తీసుకువస్తున్నామని వెల్లడించారు.

**స్థానిక ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట**

తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ బీసీలకు అండగా నిలుస్తుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంతో పాటు, అధిక స్థానాలను కేటాయించడానికి కట్టుబడి ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. గత వైసీపీ పాలనలో దౌర్జన్యాలతో స్థానిక సంస్థలను కైవసం చేసుకున్నారని, ఇప్పుడు చట్టబద్ధంగా, పారదర్శకంగా ఎన్నికలు జరుగుతాయని అన్నారు. కూటమి ప్రభుత్వ సుపరిపాలన, అభివృద్ధి, మెరుగైన శాంతిభద్రతలే తమకు శ్రీరామరక్ష అని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించి చంద్రబాబుకు ఘన విజయాన్ని కానుకగా అందిస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## వైద్య రంగంలో ఈ ఏడాది ముగ్గురికి నోబెల్..
### మెదడు రహస్యాలను ఛేదించిన 'ఆప్టోజెనెటిక్స్

ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారాల ప్రకటన ప్రారంభమైంది. 2026 సంవత్సరానికి గాను వైద్యశాస్త్రంలో (ఫిజియాలజీ/మెడిసిన్) ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపికయ్యారు. అమెరికాకు చెందిన కార్ల్ డీస్సెరొత్ (స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ), జర్మనీకి చెందిన పీటర్ హెగెమాన్ (హంబోల్ట్ యూనివర్సిటీ), జార్జ్ నాజెల్ (వుర్జ్‌బర్గ్ యూనివర్సిటీ) ఈ గౌరవాన్ని దక్కించుకున్నారు. 'కాంతి ఆధారిత అయాన్ చానెళ్లు, ఆప్టోజెనెటిక్స్'పై వారు చేసిన అద్భుతమైన ఆవిష్కరణలకు గాను నోబెల్ కమిటీ వారిని ఎంపిక చేసినట్లు సోమవారం ప్రకటించింది. ఈ ఆవిష్కరణ న్యూరోసైన్స్ (నాడీశాస్త్రం) రంగంలో ఒక కొత్త శకానికి నాంది పలికింది. మన మెదడు జ్ఞాపకాలను, భావోద్వేగాలను, ప్రవర్తనలను ఎలా నియంత్రిస్తుందనేది ఎన్నో శతాబ్దాలుగా ఒక పెద్ద మిస్టరీ. 20వ శతాబ్దంలో శాస్త్రవేత్తలు మెదడులోని ఏయే ప్రాంతాలు ఏయే పనులను ప్రభావితం చేస్తాయో పరిశోధించడం మొదలుపెట్టారు. కానీ, అప్పటి పద్ధతులతో కచ్చితమైన కారణాలను నిర్ధారించడం సాధ్యపడలేదు. వారి వద్ద ఉన్న మెదడు చిత్రం, ఎన్నో ప్రశ్నలతో, ఖాళీలతో నిండిన ఒక చిత్తుపటంగానే మిగిలిపోయింది. అయితే, ఆప్టోజెనెటిక్స్ రాకతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. "ఒకప్పుడు కల అనుకున్న మెదడును మ్యాపింగ్ చేసే అవకాశాన్ని ఆప్టోజెనెటిక్స్ సాకారం చేసింది" అని నోబెల్ కమిటీ చైర్మన్ పెర్ స్వెన్నింగ్‌సన్ వ్యాఖ్యానించారు. ఈ అద్భుత ఆవిష్కరణకు పునాది వేసింది పీటర్ హెగెమాన్ జిజ్ఞాస. 'క్లామిడోమోనాస్' అనే ఒకే కణం కలిగిన నాచు (ఆల్గే) కాంతి ఉన్నవైపు ఎలా ఈదగలుగుతోందని ఆయన ఆలోచించారు. 2000ల ప్రారంభంలో, ఆయన తన సహచరుడు జార్జ్ నాజెల్‌తో కలిసి ఆ నాచు కణం ఉపరితలంపై 'ఛానెల్‌రోడోప్సిన్' అనే ఒక ప్రత్యేకమైన ప్రొటీన్‌ను కనుగొన్నారు. దీనిపై నీలి రంగు కాంతి పడినప్పుడు, ఆ ప్రొటీన్‌లో ఒక మార్గం (ఛానెల్) తెరుచుకుని, అయాన్లు కణం లోపలికి ప్రవహించి ఒక విద్యుత్ సంకేతాన్ని సృష్టిస్తాయని వారు గుర్తించారు. ఈ ప్రొటీన్‌ను ఏ కణంలో ప్రవేశపెట్టినా, ఆ కణం కాంతికి స్పందించేలా మారుతుందని నిరూపించారు.

ఈ పరిశోధనను కార్ల్ డీస్సెరొత్ మరో స్థాయికి తీసుకెళ్లారు. ఆయన ఛానెల్‌రోడోప్సిన్ జన్యువును ఎలుకల మెదడులోని నరాల కణాలలోకి ప్రవేశపెట్టారు. ఆ తర్వాత వాటిపై నీలి కాంతిని ప్రసరింపజేసి, నరాల సంకేతాలను విజయవంతంగా ప్రేరేపించగలిగారు. 2005లో ఆయన ఈ ప్రయోగాన్ని ప్రచురించగా, రెండేళ్ల తర్వాత 2007లో బతికున్న ఎలుకల మెదడులో ఈ 'కాంతి ఆధారిత స్విచ్' పనిచేసేలా చేసి సంచలనం సృష్టించారు. ప్రస్తుతం 'ఆప్టోజెనెటిక్స్' అని పిలుస్తున్న ఈ పద్ధతి ప్రపంచవ్యాప్తంగా వేగంగా ప్రాచుర్యం పొందింది. దీనిని ఉపయోగించి పరిశోధకులు నిర్దిష్ట జ్ఞాపకాలు, భయం, ఆనందం వంటి భావోద్వేగాలు, ప్రవర్తనలను నియంత్రించే నాడీ వలయాలను (న్యూరల్ సర్క్యూట్స్) ఛేదిస్తున్నారు. ఇది మానసిక, నాడీ సంబంధిత వ్యాధులపై మన అవగాహనను పెంచుతోంది. వైద్య రంగంలో, దృష్టి లోపం ఉన్నవారికి తిరిగి చూపును అందించే ప్రయత్నాల్లో ఈ పద్ధతిపై ప్రయోగాలు జరుగుతున్నాయి. ఆప్టోజెనెటిక్స్ ఆవిష్కరణ మన మెదడుపై ఉన్న అవగాహనను సమూలంగా మార్చేసింది. ఈ సాంకేతికత సాయంతో ప్రతిరోజూ కొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వస్తూ, మానవాళి ముందున్న అతిపెద్ద రహస్యాలలో ఒకటైన మన మెదడు పనితీరును అర్థం చేసుకోవడానికి మార్గం సుగమం చేస్తున్నాయి.

## రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

"యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం" అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.30,156 కోట్ల విలువైన 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో 24,601 ఆవాసాల్లో 50,315 పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల్ – జలజీవన్ మిషన్'కు 2019–24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు" అని దుయ్యబట్టారు. 2024లో ఈ పథకం ముగిసిపోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. "గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష" అని పవన్ పేర్కొన్నారు. తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. "దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం. అలాగే, వైసీపీ ఎంపీ ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం" అని ఉద్ఘాటించారు. గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి మద్దతిచ్చారనే కారణంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం గ్రామ ప్రజలను నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారని, వారి వినతిపత్రాన్ని కళ్లెదుటే నలిపి పడేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల అభివృద్ధి కోసం తక్షణమే రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని గణాంకాలతో వివరించారు. "రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2024 వరకు నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్ల సామర్థ్యానికి అదనంగా 50 శాతం నుంచి 175 శాతం వరకు కేవలం ఈ ఐదేళ్లలోనే నిర్మించబోతున్నాం" అని తెలిపారు. నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అయితే, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'మా అనుమతి లేదు'.. ఫారమ్-6పై సుప్రీంకోర్టు షాకింగ్ కామెంట్స్

- మొదటి పేజి తరువాయి

సీజేఐ చెప్పారు. "సవరించిన ఫారమ్–6ను మేం ఆమోదించలేదు. ఇది స్పష్టం" అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. అయితే ఫారమ్–6ను సవరించలేదని ఎన్నికల సంఘం చెబుతోంది. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్) కోసం కొత్త ఓటర్లకు అదనపు డిక్లరేషన్ మాత్రమే జత చేశామని వివరిస్తోంది. ఈ అదనపు ప్రకటనను జులైలో చేర్చారు. ఇందులో తల్లిదండ్రులు లేదా తాత, అమ్మమ్మల పాత ఓటరు జాబితా వివరాలను అనుసంధానించాల్సి ఉంటుంది. ఫారమ్–6 రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్–1960లో భాగం. ఈ నిబంధనల్లో మార్పులు చేయాలంటే అధికారికంగా సవరణ చేయాల్సి ఉంటుంది. సెప్టెంబరు 29న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాకేత్ గోఖలే ఈ అంశాన్ని లేవనెత్తారు. ఫారమ్–6 మార్పులకు సంబంధించి ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ప్రతిపాదన తమ వద్ద లేదని న్యాయశాఖ ఆర్టీఐ సమాధానంలో చెప్పినట్లు ఆయన తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఒంటరిగానే నిర్ణయాలు తీసుకున్నారా? అనే అంశంపైనా సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. గత 10 నెలల్లో 'సర్'కు సంబంధించిన నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఇటీవల ఓ కథనం వెలువడిన విషయం తెలిసిందే.

## అంబటి రాంబాబుకు కిర్లంపూడి పోలీసుల నోటీసులు

- మొదటి పేజి తరువాయి

వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సందర్భంగా జరిగిన ఘటనకు సంబంధించి విచారణకు హాజరు కావాలని కిర్లంపూడి పోలీసులు ఈ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీన విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో స్పష్టం చేయగా, అంబటి రాంబాబు దీనిపై స్పందించారు. ఆ రోజు తనకు ఇతర కార్యక్రమాలు ఉన్నాయని, విచారణకు ఎప్పుడు హాజరయ్యేది త్వరలోనే తెలియజేస్తానని ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు.

**కేసు నేపథ్యం ఇదే..**

ఈ ఏడాది జూలై 16న వైసీపీ నేత ముద్రగడ పద్మనాభం అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అంబటి రాంబాబు అడ్డుకున్నారని, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిని నెట్టివేశారని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై అప్పట్లోనే కిర్లంపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో భాగంగానే తాజాగా విచారణకు రావాలంటూ అంబటి రాంబాబుకు నోటీసులు అందజేశారు.

# నంద్యాల పట్టణంలో పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్

- విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, మౌలిక వసతుల పరిశీలన
- మంత్రి ఫరూక్ ప్రశ్నలకు చక్కగా సమాధానమిచ్చిన 10వ తరగతి విద్యార్థిని లక్ష్మీ ప్రసన్న కు సన్మానం





**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 05**

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మరింత బలోపేతం చేసే కార్యాచరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ సోమవారం నంద్యాల పట్టణంలోని పలు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.
పట్టణంలోని హోలీ క్రాస్ హైస్కూల్, ఖలీల్ సిద్ధికి హైస్కూల్, సిద్ధికి ఎయిడెడ్ ప్రైమరీ స్కూల్ తదితర మూడు పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల హాజరు, పాఠశాల రోజువారీ నిర్వహణ మరియు ఎదుర్కొంటున్న సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లోని విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడిన మంత్రి ఫరూక్ , వారి అభ్యసన స్థాయిలను తెలుసుకునేందుకు పలు ప్రశ్నలు వేశారు. ఖలీల్ సిద్ధికి హైస్కూల్ సందర్శన సందర్భంగా పదో తరగతి చదువుతున్న విద్యార్థిని లక్ష్మీ ప్రసన్నను మంత్రి ఫరూక్ పలు ప్రశ్నలు అడగగా, ఆ విద్యార్థిని ఏమాత్రం తడబడకుండా పుస్తకంలోని అంశాలను సమగ్రంగా వివరించింది. విద్యార్థిని ప్రతిభకు, ధైర్యానికి ముగ్ధుడైన మంత్రి ఫరూక్ , ఆమెను ప్రత్యేకంగా అభినందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించి నాణ్యమైన భోజనం విద్యార్థినిలకు అందిస్తున్నారా లేదా అని పరిశీలించాడు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగ సమగ్ర అభివృద్ధికి, నాణ్యమైన విద్యాబోధనకు కట్టుబడి ఉందని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఇటువంటి క్షేత్రస్థాయి పర్యవేక్షణలు నిరంతరం కొనసాగుతాయని మంత్రి ఫరూక్ తెలిపారు . పాఠశాలల సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సకాలంలో తగిన దిద్దుబాటు చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

# పనులు వేగంగా పూర్తి చేయాలి



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబరు 5:**

జిల్లాలో కొనసాగుతున్న ఇంజనీరింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి,పూర్తయినప్రాజెక్టులను వినియోగం లోకి తీసుకురావాలని కలెక్టర్ జి. రాజకుమారిఅధికారులను ఆదేశించారు. పనుల పురోగతిపై ప్రతి 15 రోజులకు సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. భూ కేటాయింపులకు నిర్దేశిత ఈ-ఫైల్ విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. 57, 1517 ఏళ్ల పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్‌ను దసరా సెలవుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 52,133 మంది విద్యార్థులకు అప్‌డేట్ చేయాల్సి ఉందని తెలిపారు. ఆళ్లగడ్డ బాలసదనంలో విద్యుత్, సివిల్ పనులను భద్రతతో పూర్తి చేయాలని, పాత బావికి రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# వనస్యతో మహిళలకు మార్కెట్




**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబరు 5**

మహిళలు, గిరిజన మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలు కల్పించి, వారికి స్థిరమైన ఆదాయం అందించడమే వనస్య కేంద్రం లక్ష్యమని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలు ఆవరణలో ఏర్పాటు చేసిన వనస్య కేంద్రాన్ని ఆమె పరిశీలించారు.
జూట్ బ్యాగులు, పౌచ్‌లు, జ్యువెలరీ, హస్తకళా ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, విద్యాసంస్థల నుంచి పెద్దఎత్తున ఆర్డర్లు వచ్చేలా మార్కెటింగ్ బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక మహిళా ఉత్పత్తులను వినియోగించాలని కోరారు.

# ఘనంగా గురుదాస్ కామత్ జయంతి వేడుకలు





- కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్.. నిత్యావసర సరుకుల పంపిణీ

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 05:**

పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దివంగత మాజీ కేంద్ర మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గురుదాస్ కామత్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ షేక్ కరీముల్లా ఆధ్వర్యంలో, ఈ కార్యక్రమం జరిగింది.
ఈ సందర్భంగా గురుదాస్ కామత్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పేదలు, అవసరమైన వారికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గురుదాస్ కామత్ కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలం సేవలందించి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన సీనియర్ నాయకుడిగా గుర్తుండిపోతారని పేర్కొన్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ సామాజిక సేవా కార్యక్రమంగా నిత్యావసర సరుకుల పంపిణీ చేపట్టడం జరిగిందన్నారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు ఎన్. బత్తయ్య, పాస్టర్ సోదరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 20 రోజులు గడిచినా.. వీఆర్ఏల గోడు

## పట్టదా-జిల్లా అధ్యక్షుడు నారాయణ




**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 05**

గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జిల్లా అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. నంద్యాల తహశీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏల సమ్మె సోమవారం 20వ రోజుకు చేరింది.
ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ రూ.10,500 వేతనంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిదేళ్లుగా వేతనాలు పెరగలేదన్నారు. తెలంగాణ తరహాలో పే స్కేలు అమలు చేయడంతో పాటు వీఆర్ఏలకు వీఆర్వో పదోన్నతులు కల్పించాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.
ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, అప్పటి వరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఎర్ర బూరిగలు, మండల అధ్యక్షులు ఆకతర్ భాష, నగేష్, శేఖర్, నాగేంద్ర, మనోహర్ తదితర వీఆర్ఏలు పాల్గొన్నారు.

# మహానందీశ్వరుడిని దర్శించుకున్న నూతన సబ్ కలెక్టర్

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 05**

నంద్యాల నూతన సబ్ కలెక్టర్ మనీషా సోమవారం మహానంది క్షేత్రాన్ని సందర్శించి శ్రీ మహానందీశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మహానంది పుణ్యక్షేత్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు, మహానంది తహసీల్దార్ రమాదేవి సబ్ కలెక్టర్ మనీషాకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి దర్శనం చేసుకున్నారు. దేవస్థానం అధికారులు ఆలయ విశిష్టత, పూజా కార్యక్రమాలు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆమెకు వివరించారు. సబ్ కలెక్టర్ వెంట అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# రుక్మభాయి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే భోంస్లే నారాయణ్ రావు పటేల్





**. పెన్ పవర్ అక్టోబర్ 05**

తానూర్ మండలంలోని ఝరి బి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గడ్డేమొల్ల రుక్మభాయి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ, మాజీ ఎమ్మెల్యే భోంస్లే నారాయణ్ రావు పటేల్ పరామర్శించారు. రుక్మభాయి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.
ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని పేర్కొన్నారు.
ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఝరి సర్పంచ్ బాబన్నా, వడ్గామ్ సర్పంచ్ గోవింద్ రావు పటేల్, తానూర్ మండల అధ్యక్షుడు పుండలీక్, మాధవరావు పటేల్, మాజీ ఎంపీపీ చంద్రకాంత్, మధు పటేల్, లక్ష్మణ్, డాక్టర్ యోగేష్, వాగెమరి అనిల్ (ఉప సర్పంచ్), మాజీ సర్పంచ్ గంగాధర్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# పెన్ పవర్
## రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

# జనసేనలో చేరిన సత్రావాడ ప్రవీణ్‌కు ఘన సన్మానం

## పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేస్తాం: జనసైనికులు





**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 05:**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరిన సత్రావాడ ప్రవీణ్‌ను పానగల్‌లోని ఆయన కార్యాలయంలో జనసేన నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ.. సత్రావాడ ప్రవీణ్‌కు, జనసేన పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ప్రజల సహాయ సహకారాలతో జనసేన పార్టీని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మరింత విస్తరించేలా కృషి చేస్తామని తెలిపారు.
పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రజా సమస్యలపై స్పందిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తామని వెల్లడించారు.
ఈ కార్యక్రమంలో కొత్వాల కిరణ్ రాయల్, కొత్తపేట సాయి, కళ్యాణ్ రామ్, సుజిత్ యాదవ్, ఎస్.కె. రెహమాన్, కిరణ్ యాదవ్, సంతోష్ కుమార్ యాదవ్, అరుణ్ రాయల్, కిషోర్ రెడ్డి, చైతన్య, మౌళి, జగదీష్, ఈశ్వర్, తేజ, మోక్ష తదితర జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

# జనసేన బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలి



- లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్‌ను కలిసిన మిద్దెల హరి, సత్రవాడ ప్రవీణ్



**శ్రీకాళహస్తి ,పెన్ పవర్, అక్టోబర్ 05:**

లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్‌ను శ్రీకాళహస్తి జనసేన నాయకులు మిద్దెల హరి, సత్రవాడ ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతిలోని ఆయన కార్యాలయంలో తిరుపతి జనసేన పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు తమ్మినేని వెంకటేశ్వర్లుతో కలిసి వారు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరస్వామివారి వస్త్రాన్ని అందజేసి డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీలో చేరిన విషయాన్ని వివరించారు.
శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయడం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడంపై ఈ సందర్భంగా నాయకులు చర్చించారు. పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమష్టిగా కృషి చేయాలని నిర్ణయించారు.
ఈ కార్యక్రమంలో తిరుపతి జనసేన నాయకుడు మునస్వామి, మాజీ కౌన్సిలర్ జై దేవాన్ గిరి, నార్జాల నరేంద్ర, కంటా మునిరత్నం, గిరి, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి పి జి ఆర్ ఎస్ ను సద్వినియోగం చేసుకోవాలి

## ఏర్పేడు మండల టీడీపీ అధ్యక్షుడు పేరం నాగరాజ నాయుడు

**ఏర్పేడు, పెన్ పవర్, అక్టోబర్ 05:**

ప్రజల సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (బి జి ఆర్ ఎస్)ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏర్పేడు మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజ నాయుడు కోరారు.
సోమవారం ఏర్పేడు మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ా+=ా కార్యక్రమంలో ఎంఆర్వో రాజశేఖర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు పేరం నాగరాజ నాయుడు మాట్లాడుతూ.. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి పి జి ఆర్ ఎస్ ఒక వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో కేశినేని సుబ్రమణ్యం, గుణా యాదవ్, రాచేటి సుబ్రమణ్యం, వై. మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.




# విద్యార్థిని ప్రతిభకు మంత్రి ఫరూక్ ప్రశంస



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 05**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, మౌలిక వసతుల పరిశీలనలో భాగంగా రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ సోమవారం నంద్యాల పట్టణంలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోలీ క్రాస్ హైస్కూల్, ఖలీల్ సిద్ధికి హైస్కూల్, సిద్ధికి ఎయిడెడ్ ప్రైమరీ స్కూళ్లను సందర్శించి తరగతి గదులు, తాగునీరు, పారిశుద్ధ్యం, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.
విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యసన సామర్థ్యాలను తెలుసుకునేందుకు ప్రశ్నలు వేశారు. ఖలీల్ సిద్ధికి హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థిని లక్ష్మీ ప్రసన్న మంత్రి అడిగిన ప్రశ్నలకు చక్కగా సమాధానాలు ఇవ్వడంతో ఆమె ప్రతిభను అభినందించి శాలువాతో సన్మానించారు.
ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఫరూక్ తెలిపారు. పాఠశాలల సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షించి అవసరమైన చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

# దళితుల దారికి అడ్డంకి.. చర్యలు తీసుకోవాలి

## గంగలపూడిలో 15 ఏళ్లుగా సమస్య.. ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఎం నిరసన



**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 05:**
గంగలపూడిలో దళిత కుటుంబాలు వినియోగిస్తున్న రహదారిని అడ్డుకుంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకుని, తమ దారి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి డిమాండ్ చేశారు. బాధిత దళిత కుటుంబాలతో కలిసి సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు.

**ఈ సందర్భంగా గంధం మణి మాట్లాడుతూ..**
శ్రీకాళహస్తి రూరల్ మండలం గంగలపూడిలో సుమారు 15 ఏళ్ల క్రితం 70 దళిత కుటుంబాల కోసం నూతన కాలనీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే కాలనీలోని నాలుగో వీధికి ఎదురుగా బీసీ కాలనీలో నివసిస్తున్న ఓ వ్యక్తి తనకు వీధి పోటు ఉందంటూ పేడ దిబ్బ వేసి రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు.
దీంతో నాలుగో వీధిలో నివసిస్తున్న దళిత కుటుంబాలు ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. రహదారి సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆ వీధికి ఇప్పటికీ సీసీ రోడ్డు కూడా మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే స్పందించి స్థల పరిశీలన చేపట్టి, దళితుల రాకపోకలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.
అనంతరం గంధం మణి, బాధిత కుటుంబాలతో కలిసి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డికి వినతిపత్రం సమర్పించి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# చేమూరు చెరువులను కాపాడండి

## ఆక్రమణలపై గ్రామస్తుల ఆందోళన.. పూర్తిస్థాయి సర్వేకు డిమాండ్

**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 05:**
పెద్దలచౌరబాట్లు, ఆక్రమణలతో నానాటికీ కుంచించుకుపోతున్న చేమూరు చెరువులను కాపాడాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు సోమవారం తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. గ్రామస్తులకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య మద్దతు తెలిపారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేమూరు పరిధిలోని చింతల చెరువు, రాయల చెరువు, ఎద్దల చెరువులు సుమారు 500 ఎకరాల ఆయకట్టుకు ఆయువుపట్టులా ఉన్నాయని తెలిపారు. అయితే చేమూరు, చియ్యవరం గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు చెరువు భూములను ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నారని ఆరోపించారు. ఎద్దల చెరువును పూర్తిగా పూడ్చివేసిన పరిస్థితి ఏర్పడిందని, మిగిలిన రెండు చెరువులు కూడా సగానికి పైగా ఆక్రమణలకు గురయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు.
చెరువుల ఆక్రమణలపై గ్రామస్తులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఉమ్మడి సర్వే చేపట్టినట్లు తెలిపారు. అయితే సర్వే ప్రక్రియ సజావుగా సాగకుండా కొందరు అడ్డంకులు సృష్టిస్తున్నారని, రెవెన్యూ అధికారులు ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు.



చెరువుల పరిరక్షణతోనే ఆయకట్టు రైతులకు సాగునీటి భద్రత సాధ్యమవుతుందని, అధికారులు తక్షణమే స్పందించి పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి, ఆక్రమణలను గుర్తించి తొలగించి, చెరువుల విస్తీర్ణాన్ని పరిరక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.
ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్యతో పాటు పెంచలయ్య, సీతారామయ్య, శంకరయ్య, జనార్ధన్, వెంకటయ్య, చిన్న పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# హుండీకి భక్తుల కానుకల వెల్లువ.. 26 రోజుల్లో రూ.1.52 కోట్ల ఆదాయం!

## 37 గ్రాముల బంగారం.. 421.7 కిలోల వెండి.. 85 విదేశీ కరెన్సీ నోట్లు





**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 05:**
దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానానికి భక్తులు సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు సోమవారం ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. 09-09-2026 నుంచి 05-10-2026 వరకు 26 రోజులపాటు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను ఆలయ అధికారులు, సిబ్బంది, సేవకుల సమక్షంలో లెక్కించారు.
ఈ లెక్కింపు ప్రక్రియను ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ సాయి కొట్టే ప్రసాద్, ఆలయ నిర్వహణ అధికారి శ్రీ వెంకటేశ్వలు, ఇతర బోర్డు సభ్యులు పరిశీలించారు.
26 రోజుల హుండీ కానుకల్లో 37 గ్రాముల బంగారం, 421 కిలోల 700 గ్రాముల వెండి లభించింది. నగదు రూపంలో భారతీయ కరెన్సీ నోట్లు రూ.1,46,73,913, నాణేల రూపంలో రూ.5,98,253 లభించగా, మొత్తం నగదు ఆదాయం రూ.1,52,72,166గా నమోదైంది.
అదేవిధంగా వివిధ దేశాలకు చెందిన 85 విదేశీ కరెన్సీ నోట్లు హుండీల ద్వారా భక్తులు సమర్పించారు. అమెరికా, మలేషియా, ఆస్ట్రేలియా, శ్రీలంక, కెనడా, ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, కువైట్ తదితర దేశాల కరెన్సీ ఇందులో ఉన్నట్లు అధికారులు తెలిపారు.
భక్తులు స్వామివారిపై ఉంచుతున్న విశ్వాసానికి హుండీ కానుకలు ప్రతీకగా నిలుస్తున్నాయని ఆలయ అధికారులు పేర్కొన్నారు. భక్తుల కానుకలను నిబంధనల ప్రకారం పారదర్శకంగా లెక్కించి, భద్రపరుస్తున్నామని తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, సేవకులు సమన్వయంతో విధులు నిర్వహించారు.

# గూడూరులో ఘనంగా అంగన్వాడీ ఉత్సవం

## పోషకాహారంపై అవగాహన కల్పించిన అధికారులు





**గూడూరు, పెన్ పవర్, అక్టోబర్,05:**
గూడూరు పట్టణంలోని నరసింహారావుపేట సెక్టార్ పరిధిలోని సీతమ్మబడి వద్ద ఉన్న అంగన్వాడీ కేంద్రంలో సోమవారం అంగన్వాడీ ఉత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ మెహబూబీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గూడూరు ఎంఈఓ మాధవరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఎంఈఓ మాధవరావు మాట్లాడుతూ గూడూరు అర్బన్ పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ ఉత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గర్భిణీలు, బాలింతలు ప్రతిరోజూ పోషకాహారం తీసుకోవడం ద్వారా తల్లితో పాటు శిశువు ఆరోగ్యంగా ఎదగడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా గుడ్లు, పాలు, ఆకుకూరలు తదితర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. అనంతరం సీడీపీఓ మెహబూబీ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ సందర్భంగా తల్లులను సన్మానించారు.
కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ బి. హేమలత, అంగన్వాడీ కార్యకర్తలు పి.వి. రమణమ్మ, టి. రాజేశ్వరి, పి. జోష్ణ, పి. సుప్రియ, టి. తులసి, ఏఎన్ఎం మాలతి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# ముక్కంటి ఆలయంలో బంకుల బాబురావు హవా?

- అగరబత్తీల కాంట్రాక్టు మాటున పంచెలు, కండువాల విక్రయాల ఆరోపణలు
- వరుస కథనాలు వచ్చినా అధికారుల మౌనం.. కాంట్రాక్టు రద్దు చేసి సమగ్ర విచారణకు భక్తుల డిమాండ్

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 05:**
శ్రీకాళహస్తి ముక్కంటి ఆలయంలో అగరబత్తీల బంకుల కాంట్రాక్టు వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. అగరబత్తీల విక్రయాలకు మాత్రమే కేటాయించిన కాంట్రాక్టు పరిధిని దాటి పంచెలు, కండువాలు తదితర వస్తువులను విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఆలయ కాంట్రాక్టుల నిర్వహణ, నిబంధనల అమలుపై భక్తుల్లో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి.
అదేవిధంగా కుటుంబ సభ్యుల పేర్లతో కాంట్రాక్టులు పొందారన్న ఆరోపణలు కూడా తెరపైకి రావడంతో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఈ ఆరోపణలపై ఆలయ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన వివరణ ఇవ్వకపోవడం చర్చకు దారితీస్తోంది.

**వరుస కథనాలు.. అయినా చర్యలు ఏవీ?**
అగరబత్తీల బంకుల కాంట్రాక్టు నిబంధనల ఉల్లంఘనపై గత కొద్దిరోజులుగా పలు పత్రికల్లో వరుస కథనాలు వెలువడుతున్నాయి. అయినప్పటికీ



సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించారా? నిర్వహించి ఉంటే ఏం తేలింది? నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు స్పష్టత లేకపోవడంతో భక్తుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

**నిబంధనలు అందరికీ సమానమేనా?**
ఆలయ పరిధిలోని ప్రతి కాంట్రాక్టు నిర్దేశిత నిబంధనలకు లోబడి నిర్వహించాల్సి ఉంటుందని భక్తులు పేర్కొంటున్నారు. ఒక కాంట్రాక్టు ఏ ప్రయోజనం కోసం కేటాయించబడిందో, అదే పరిధిలో వ్యాపారం కొనసాగించాల్సి ఉంటుందని అంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇతర వస్తువుల విక్రయాలు జరిగితే ఆలయ ఆదాయంపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

**ఉన్నతాధికారులు దృష్టి సారించాలి**
స్థానిక స్థాయిలో స్పష్టమైన చర్యలు కనిపించకపోవడంతో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ స్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి, అగరబత్తీల బంకుల కాంట్రాక్టు నిబంధనలు, కేటాయింపు విధానం, జరుగుతున్న విక్రయాలపై పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలని డిమాండ్ చేస్తున్నారు.
విచారణలో నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే కాంట్రాక్టును రద్దు చేసి, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. అదే సమయంలో ఆరోపణల్లో వాస్తవం లేదని తేలితే, ఆలయ అధికారులు వాస్తవాలను ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని సూచిస్తున్నారు.
ముక్కంటి ఆలయంలో కాంట్రాక్టు నిబంధనలు ఎవరికైనా ఒకేలా వర్తిస్తున్నాయా? అగరబత్తీల కాంట్రాక్టు పరిధి దాటి విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై అధికారులు ఏం తేల్చారు? అనే ప్రశ్నలకు దేవస్థానం అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉందని భక్తులు పేర్కొంటున్నారు.

# స్కియిమ్స్ లో ఘనంగా ఎంబీఏ , ఎంసీఏ తరగతుల ప్రారంభం

- విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకుంటే ఉజ్వల భవిష్యత్ ముఖ్య అతిథులు
- ఏషియన్ గేమ్స్ పతక విజేత గణేష్ మణిరత్నం తండ్రికి ఘన సన్మానం

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 05:**
శ్రీకాళహస్తీశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ సైన్సెస్ (స్కియిమ్స్ ) కళాశాలలో 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీఏ ,ఎం సి ఏ తరగతుల ప్రారంభోత్సవం, ఓరియంటేషన్ కార్యక్రమం, ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉన్నత విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమంలో ఏషియన్ గేమ్స్లో బంగారు, రజత పతకాలు సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచిన నాయుడుపేటకు చెందిన 19 ఏళ్ల యువ క్రీడాకారుడు తిరుమూరు గణేష్ మణిరత్నంను అభినందిస్తూ, ఆయన తండ్రి తిరుమూరు హరి ప్రసాద్‌ను విద్యార్థులు, కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హరి ప్రసాద్ మాట్లాడుతూ.. తన కుమారుడు పట్టుదలతో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి దేశానికి పేరు తీసుకురావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గణేష్ మణిరత్నం సోమవారం సాయంత్రం తిరుపతి విమానాశ్రయానికి చేరుకోనున్నట్లు తెలిపారు.
ముఖ్య అతిథి డాక్టర్ ఎం. రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. ఎంబీఏ ,ఎంసీఏ వంటి వృత్తి విద్యా కోర్సులను నైపుణ్యంతో పూర్తి చేస్తే ప్రస్తుత పోటీ ప్రపంచంలో విస్తృతమైన ఉపాధి అవకాశాలను



అందిపుచ్చుకోవచ్చన్నారు.
కళాశాల కరస్పాండెంట్ మిద్దెల హరి మాట్లాడుతూ.. శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో స్థానికంగా కూడా విద్యార్థులకు అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు.
స్కియి కాలేజ్ ప్రిన్సిపాల్ ఎ. శ్రీకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమ సబ్జెక్టులపై పూర్తి పట్టు సాధించడంతో పాటు శ్రద్ధ, క్రమశిక్షణతో చదివినప్పుడే పోటీ ప్రపంచంలో మెరుగైన అవకాశాలను సాధించగలరన్నారు.
స్కియిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ గీతాదేవి ఎంబీఏ , ఎంసీఏ కోర్సుల ప్రాధాన్యత, విద్యార్థులకు లభించే భవిష్యత్ అవకాశాలు, కళాశాల మిషన్, విజన్, కోడ్ ఆఫ్ కాండక్ట్ తదితర అంశాలను వివరించారు. అనంతరం డాక్టర్ దొరై రాజ్, జీఎం - హెచ్ ఆర్, ఈసీఎల్ రచించిన 'కాలేజ్ టు కార్పొరేట్' పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు.
అనంతరం విద్యార్థులకు కళాశాలలోని కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, ప్లేస్‌మెంట్ సెల్, క్రీడా మైదానం



తదితర సౌకర్యాలతో పాటు కోర్సు కరిక్యులమ్‌పై అవగాహన కల్పించారు. నూతనంగా ప్రవేశం పొందిన ఎంబీఏ , ఎంసీఏ విద్యార్థులు క్యాంపస్‌లోని వివిధ విభాగాలను సందర్శించి విద్యా, మౌలిక సదుపాయాలపై అవగాహన పొందారు.
ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కళాశాల యాజమాన్యం ముఖ్య అతిథులతో పాటు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించింది. అనంతరం జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిసింది.

# అంగన్వాడీ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

## సీఐటీయూ జిల్లా కార్యదర్శి వాణిశ్రీ పిలుపు

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 5:**
ఈ నెల 10, 11 తేదీల్లో సూళ్లూరుపేట వేదికగా నిర్వహించనున్న సీఐటీయూ అనుబంధ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా రెండో మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి వాణిశ్రీ పిలుపునిచ్చారు. సోమవారం శ్రీకాళహస్తిలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో మహాసభలకు సంబంధించిన గోడపత్రికలు, కరపత్రాలను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ.. అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల పట్ల కూటమి ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని విమర్శించారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయడంతో పాటు గ్రాట్యుటీని కల్పించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని మండిపడ్డారు.



అంగన్వాడీ ఉద్యోగుల రిటైర్మెంట్ వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచాలని, పదవీ విరమణ బెనిఫిట్స్ అందించాలని, ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలపై భవిష్యత్ కార్యాచరణను మహాసభల్లో చర్చించి నిర్ణయిస్తామని తెలిపారు. జిల్లాలోని అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు అధిక సంఖ్యలో



పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు రాజేశ్వరి, రేవతి, శ్యామల, మునికుమారి, స్వరూపారాణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుబ్రమణ్యం, జీ. బాలసుబ్రమణ్యం, అంగేరి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# నిరంతర హాజరే విద్యార్థుల విజయానికి తొలి మెట్టు

- ప్రతిభ, హాజరులో ఉత్తమ విద్యార్థులకు ప్రతినెలా 'బెస్ట్ స్టూడెంట్' బ్యాడ్జి

**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 05:**
విద్యార్థుల్లో క్రమశిక్షణ, పాఠశాలపై ఆసక్తి, ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యే అలవాటును పెంపొందించేందుకు శ్రీకాళహస్తి పట్టణంలోని బీపీ అగ్రహారం మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్ యాజమాన్యం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది.
ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్. నౌజియా మాట్లాడుతూ.. పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో ప్రతిరోజూ పాఠశాలకు హాజరవుతూ, చదువులోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థి/విద్యార్థిని గుర్తించి ప్రతి నెలా 'బెస్ట్ స్టూడెంట్' బ్యాడ్జి అందజేస్తామని తెలిపారు.
విద్యార్థులలో పోటీతత్వాన్ని పెంపొందించడంతో పాటు, క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతిరోజూ పాఠశాలకు పంపించాలని కోరారు.
విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాల మెరుగుదలకు



తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని పాఠశాల యాజమాన్యం విజ్ఞప్తి చేసింది.

# అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో 'లిటిల్ మాస్టర్స్' పతకాల పంట!





- 34 మంది పాల్గొంటే.. ఏకంగా 25 ప్రథమ బహుమతులు
- శ్రీకాళహస్తి విద్యార్థుల అద్భుత ప్రతిభకు ఘన సన్మానం

**శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,అక్టోబర్ 05:**

అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో శ్రీకాళహస్తి శ్రీరామనగర్ కాలనీలోని లిటిల్ మాస్టర్స్ అబాకస్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు సత్తా చాటారు. చెన్నైలో సెప్టెంబర్ 27న ఆమాట ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ డైరెక్ట్ అబాకస్ కాంపిటీషన్లో సంస్థకు చెందిన 34 మంది విద్యార్థులు పాల్గొనగా, ఏకంగా 25 మంది ప్రథమ బహుమతులు సాధించి విశేష ప్రతిభ కనబరిచారు.

ఈ విజయాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 4న శ్రీరామనగర్ కాలనీలోని ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో విజయానంద ఉత్సవం, ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు.

ఈ కార్యక్రమానికి ఆర్పీబీఎస్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య, కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ అబాకస్ శిక్షణతో విద్యార్థుల్లో మానసిక ఏకాగ్రత, గణితంపై ఆసక్తి, వేగం పెరుగుతాయని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో శ్రీకాళహస్తి విద్యార్థులు పతకాలు సాధించడం అభినందనీయమని, ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులను అభినందించారు.

కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ అబాకస్ కేవలం గణిత నైపుణ్యానికే పరిమితం కాకుండా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, గ్రహణశక్తిని పెంపొందించడంలో దోహదపడుతుందని తెలిపారు.

**ఆకట్టుకున్న 'కోటి ఎక్కాల' డెమో**

అబాకస్‌లో ఎనిమిది లెవల్స్‌ను విజయవంతంగా పూర్తి చేసిన మనోజ్ కుమార్, హేమిష్, స్వప్నిల్లకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన ప్రత్యక్ష డెమో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కోటి వరకు ఎక్కాలు, లక్షల సంఖ్యల కూడికలు, 8 నుంచి 11 అంకెల సంక్లిష్ట భాగాహారాలను వేగంగా చెప్పడం, 100 అంకెల కూడికలను సైతం క్షణాల్లో సాధించి చూపడం చూసి తల్లిదండ్రులు, అతిథులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

**లెవల్స్ వారీగా ప్రతిభ**

లెవల్1: దివిత్ సేయాన్, కార్తికేయన్, కార్తిక, గగన్‌వీర్, షణ్ముఖప్రియ, గగన్, డానిష్, జోషిత్, అభినవ్, హర్షవర్ధన్, కార్తికేయన్ తదితరులు.

లెవల్2: నితిన్, సోమేశ్వర్ కార్తీక్.

లెవల్3: జ్ఞానశ్రీ, గగనసింధు, కృష్ణ మనోహర్, లోహిత్ వర్మ, ముని మోహిత్, రాఘవేంద్ర, ముని చైతన్య, యశ్వంత్, ముని తదితరులు.

లెవల్4: యోగేష్ రాఘవేంద్ర, పవన్ కుమార్ రెడ్డి, భవదీప్, ప్రజ్వల్ రెడ్డి, యవనేష్, హేనిత్.

లెవల్5: మిషాల్, కీర్తిక, మహేష్ చంద్ర.

లెవల్7: హేమేష్.

లెవల్8 (గ్రాడ్యుయేషన్): మనోజ్ కుమార్, స్వప్నిల్, హేమిష్.

వివిధ విభాగాల్లో విద్యార్థులు ఛాంపియన్, ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్స్, టాపర్ వంటి అవార్డులను సైతం అందుకున్నారు.

ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఆర్. దివ్య మాట్లాడుతూ అంతర్జాతీయ పోటీల్లో తమ విద్యార్థులు పాల్గొనడం ఇది తొమ్మిదోసారి అని, ఈసారి కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతులు సాధించడం తమకు ఎంతో గర్వకారణమని అన్నారు.

చైర్మన్ మునికుమార్ మాట్లాడుతూ ఎనిమిదేళ్ల ప్రస్థానం పూర్తి చేసుకుని తొమ్మిదో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న లిటిల్ మాస్టర్స్ అబాకస్ సంస్థ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. విజయం కోసం శ్రమించిన విద్యార్థులతో పాటు వారికి అండగా నిలిచిన తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు.

కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఇన్‌స్టిట్యూట్ సిబ్బంది, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

## బాల్యవివాహాల నిర్మూలనకు గ్రామసభల తీర్మానాలు అభినందనీయం

## ప్రతి గ్రామం బాల్యవివాహ రహితంగా మారాలి: ప్రగతి సంస్థ డైరెక్టర్ కె.వి. రమణ




**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 05:**

బాల్యవివాహాలను పూర్తిగా నిర్మూలించి, ప్రతి గ్రామాన్ని బాల్యవివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అక్టోబర్ 2న దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక గ్రామసభల్లో తీర్మానాలు చేయడం, ప్రజలు సామూహికంగా ప్రతిజ్ఞ చేయడం అభినందనీయమని ప్రగతి సంస్థ డైరెక్టర్ కె.వి. రమణ అన్నారు. బాల్యవివాహాల నిర్మూలన దిశగా గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేలా ఈ కార్యక్రమం కీలక ముందడుగని పేర్కొన్నారు.

గాంధీ జయంతి సందర్భంగా కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖల పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. 2.42 లక్షలకు పైగా గ్రామసభలు నిర్వహించి, ఆయా గ్రామాలను బాల్యవివాహ రహిత గ్రామాలుగా మార్చేందుకు తీర్మానాలు చేశారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, ప్రభుత్వ అధికారులు పాల్గొని బాల్యవివాహాలను అరికట్టేందుకు సామూహిక ప్రతిజ్ఞ చేశారు.

ఈ సందర్భంగా కె.వి. రమణ మాట్లాడుతూ.. బాల్యవివాహాల నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలతో పాటు గ్రామస్థాయిలో ప్రజల చైతన్యం, కుటుంబాల సహకారం అత్యంత కీలకమని అన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు జిల్లా యంత్రాంగం, ముఖ్యంగా జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవి చేపడుతున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు.

ప్రతి బాలిక తన బాల్యాన్ని ఆనందంగా గడుపుతూ, చదువును కొనసాగించి, తన లక్ష్యాలను సాధించే అవకాశం పొందాలి. అది ఆమె హక్కు. బాల్యవివాహాలను అరికట్టేందుకు కుటుంబాలు, ప్రజాప్రతినిధులు,యువత,మహిళలు, ఉపాధ్యాయులు, పంచాయతీ ప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలి" అని కె.వి. రమణ పిలుపునిచ్చారు.

ప్రగతి సంస్థ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జే ఆర్ సి) భాగస్వామ్య సంస్థగా తిరుపతి జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణ కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తోందని తెలిపారు. జే ఆర్ సి భాగస్వామ్య సంస్థలతో కలిసి ప్రభుత్వాలు, జిల్లా యంత్రాంగాలు, స్థానిక సంస్థల సమన్వయంతో బాల్యవివాహాల నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

2030 నాటికి భారత్‌ను బాల్యవివాహ రహిత దేశంగా తీర్చిదిద్దే లక్ష్యానికి గ్రామసభల తీర్మానాలు, ప్రజల సామూహిక ప్రతిజ్ఞలు మరింత బలాన్నిస్తాయని కె.వి. రమణ ఆశాభావం వ్యక్తం చేశారు. 2024లో ప్రారంభమైన 'బాల్యవివాహ రహిత భారత్' కార్యక్రమంతో ఈ ఉద్యమం మరింత వేగం పుంజుకుందని, గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యం పెరిగితే బాల్యవివాహాల నిర్మూలన లక్ష్యాన్ని మరింత వేగంగా సాధించవచ్చని తెలిపారు.

## జంగాలపల్లిలో జనసేన జెండా ఆవిష్కరణకు సన్నాహాలు ముమ్మరం

## అనుమతి కోసం అధికారులకు వినతి పత్రం అందజేసిన జనసేన నాయకులు





**ఏర్పేడు, పెన్ పవర్, అక్టోబర్ 05:**

ఏర్పేడు మండలం జంగాలపల్లి గ్రామంలో జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం జనసేన నాయకులు జెండా ఆవిష్కరణకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఏర్పేడు తహశీల్దార్ (ఎమ్మార్వో), ఎంపీడీవోలను కలిసి జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి అనుమతి మంజూరు చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. త్వరలోనే జంగాలపల్లి గ్రామంలో పార్టీ శ్రేణులు, అభిమానుల సమక్షంలో అంగరంగ వైభవంగా జనసేన జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనసేన శ్రేణులు ఐక్యంగా ముందుకు సాగుతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జయప్రకాష్, కుమార్, రవిచంద్ర, డిల్లీ బాబు, జయరాం తదితరులు పాల్గొన్నారు.

## నరాల రాములుకు కౌన్సిలర్ బర్రె పూజిత -బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఘన నివాళి..

**, పెన్ పవర్, అక్టోబర్ 05:**

భువనగిరిపట్టణంలోని 23వ వార్డు ఇందిరానగర్‌కు చెందిన వార్డు పెద్దలు నరాల రాములు మృతి చెందడంతో ఆయన పార్థివదేహానికి 23వ వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత, బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు. రాములు మృతి కుటుంబ సభ్యులతో పాటు స్థానికులకు తీరని లోటని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బండారు రవివర్ధన్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు పలువురు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అవినీతి , అక్రమాలకు పాల్పడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారి పై చర్యలు చేపట్టాలి.

## . సీపీఐ సీనియర్ నాయకులు సి.వి.ఆర్ కుమార్.

**గూడూరు, పెన్ పవర్, అక్టోబర్,05:**



గూడూరు మున్సిపాలిటీ లో అవినీతి కి పాల్పడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారి ప్రకాష్ బాబు పై చర్యలు చేపట్టాలని సీపీఐ సీనియర్ నాయకులు సి.వి.ఆర్ కుమార్ తెలిపారు. సోమవారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయం నుండి రాజా వీధి మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. . ఈ సందర్భంగా సీపీఐ సీనియర్ నాయకులు సి .వి.ఆర్ కుమార్ మాట్లాడుతూ గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని ఎన్ఎస్ఆర్ ప్రసన్న రెడ్డి లేఔట్ లో ఓపెన్ స్పేస్ -1 గా చూపించిన భూమి రిజిస్టర్ చేసిన గిఫ్ట్ డీడ్ లో పేర్కొన్న భూమీమధ్య వ్యత్యాసాలపై విచారణ జరపాలన్నారు. ప్రభుత్వానికి సుమారు 78 లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందన్నారు. ఎన్ఎస్ఆర్ ప్రసన్న రెడ్డి లేఔట్ ప్లాన్ లో భాగం కానీ సర్వే నంబర్ 521 /A 1 B 10 సెంట్లు భూమిని ఓపెన్ స్పేస్ -1 లో చూపించి గూడూరు మున్సిపాలిటీకి రిజిస్టర్ చేసిన గిఫ్ట్ డిడ్ డాక్యుమెంట్ నెంబర్ 2687/2021 లో సర్వే నంబర్ 519/2, 519/3, 520/A1A2, 520/A1B2, 521/A1A, 521/A2 లో ఓపెన్ ఫేస్ -1 గా ఉన్నట్లు గా రిజిస్టర్ చేశారు. తద్వారా ప్రభుత్వ ఖజానాకు మార్కెట్ వ్యాల్యూ ప్రకారం 78 లక్షలు రూపాయలు పైగా నష్టం చేకూరింది. ప్రభుత్వాన్ని మోసం చేయాలని ముందుగా నిర్ణయించుకుని గూడూరు మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారి ప్రకాష్ బాబు, ఎన్ ఎస్ ఆర్ ప్రసన్నారెడ్డి లేఔట్ యజమానులు నువ్వు రు పద్మ ప్రసన్నారెడ్డి కలిసి మోసం చేశారు అన్నారు. వీరి పై సమగ్ర విచారణ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేసి , అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పురపాలక కమిషనర్ మల్లికార్జున రావు కి వినతి పత్రం అందచేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి . శశి కుమార్ , సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్ , సీపీఐ చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్ , ఏ.ఐ.టి. యు.సి జిల్లా అధ్యక్షులు కె.నారాయణ , బి. కె. ఎం. యు నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసమూర్తి, ఏ. ఐ.ఎస్.ఎఫ్ నాయకులు రిజ్వాన్,తదితరులు పాల్గొన్నారు.

## వీధిదీపాలు లేక చీకట్లో సుబ్బానాయుడుకండ్రిగ దారి

## సమస్యను వెంటనే పరిష్కరించాలి.. ఎంపీడీవోకు జనసేన నాయకుల వినతి



**శ్రీకాళహస్తి రూరల్,పెన్ పవర్,అక్టోబర్ 05:**

శ్రీకాళహస్తి మండలం సుబ్బానాయుడుకండ్రిగ గ్రామానికి వెళ్లే ప్రధాన దారిలో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. వీధిదీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

ఈ సమస్యను ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించకపోవడంతో జనసేన నాయకులు మరోసారి శ్రీకాళహస్తి ఎంపీడీవోను కలిసి సమస్యను వివరించి, తక్షణమే వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరారు.

ఈ సందర్భంగా జనసేన నాయకుడు జయప్రకాష్ మాట్లాడుతూ.. ఒక గ్రామానికి అవసరమైన కనీస మౌలిక సదుపాయాల్లో భాగమైన వీధిదీపాలు ఏర్పాటు చేయించుకోవడానికి కూడా ప్రజలు ఇంతగా ఇబ్బందులు పడాల్సి రావడం దురదృష్టకరమన్నారు. రాత్రివేళల్లో చీకటి కారణంగా గ్రామస్తులు, మహిళలు, వృద్ధులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

అధికారులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే అవసరమైతే జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి నేరుగా తీసుకెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని జయప్రకాష్ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జయప్రకాష్, కుమార్, మహేష్, డిల్లీబాబు, జయసూర్య, బద్రి, చిరంజీవి, రఘు, రాఘవ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేస్తాం






- కార్యకర్తలకు అండగా ఉంటాం.. కూటమి బెదిరింపులకు భయపడొద్దు
- మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 05:**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సత్తా చాటి విజయబావుటా ఎగురవేయాలని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన శ్రీకాళహస్తి మండల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమిస్తున్న నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం పార్టీ సంస్థాగత బలోపేతం, రాబోయే స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు.

ఈ సందర్భంగా బియ్యపు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలను పార్టీ శ్రేణులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి వార్డు, ప్రతి గ్రామంలో ప్రజాదరణ, అంకితభావం కలిగిన అభ్యర్థులను గుర్తించి వారి విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు.కూటమి ప్రభుత్వ బెదిరింపులకు పార్టీ శ్రేణులు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, కార్యకర్తలకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని స్పష్టం చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ తరఫున అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. జగనన్న ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. వైఎస్సార్‌సీపీకి క్షేత్రస్థాయిలో ఉన్న బలాన్ని దెబ్బతీయడం ఎవరి తరమూ కాదన్నారు.

2029 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ భారీ విజయంతో తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

**సమావేశానికి భారీగా హాజరైన పార్టీ శ్రేణులు**

ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల సీనియర్ నాయకులు బద్రి సుదర్శన రెడ్డి, మండల అధ్యక్షులు చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, చెలికం నాగరాజు రెడ్డి, రంగినేని చెంచయ్య నాయుడు, యుగంధర్ రెడ్డి కందాటి, సురేంద్ర యాదవ్, గంగిరెడ్డి, భానుమూర్తి యాదవ్, వయ్యాల మనోహర్ రెడ్డి, నలుగురి రవి, కేవస్ సుబ్రమణ్యం, మునిరత్నం రెడ్డి, కృష్ణయ్య, రవీంద్ర రెడ్డి, రాధాకృష్ణ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మధుమోహన్ రెడ్డి, మునిరాజా, గురునాథం రెడ్డి, రామచంద్రయ్య, అంకయ్య, భాను రెడ్డి, ప్రభోస్, మోడీ రాజా, సురేష్, రామచంద్రారెడ్డి, శివారెడ్డి, గుణ, శివ, జయకృష్ణ రెడ్డి, ఎల్లయ్య, రాజారెడ్డి, తిరుపాల్ యాదవ్, మనోహర్ యాదవ్, దిలీప్ బంగారు, రంగయ్య, పోలిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చుక్కల మహేష్, నాగభూషణం, డీవీ రమణ, మద్దిల ప్రకాష్, కోటి రాయల్, కిరణ్ రాయల్, శంకర్ యాదవ్, శివ ఈశ్వరయ్య, వెంకట రెడ్డి, కలివేళయ, ప్రసాద్ యాదవ్, అమర్‌నాథ్ రెడ్డి, పండయ్య యాదవ్, జయకృష్ణ, నక్క పెంచలయ్య, ప్రసాద్, శివ రాయల్, భాను ప్రకాష్ రెడ్డి, ప్రభాకర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## పచ్చర్లబోడుతండా గ్రామంలో మహిళా భవనంకు శంకుస్థాపన

## భూమిపూజను చేసిన సర్పంచ్ జ్యోతి నరసింహ

**, పెన్ పవర్, అక్టోబర్ 05:**

భువనగిరి మండలంలోనిపచ్చర్లబోడుతండా గ్రామంలో మహిళా భవనం శంకుస్థాపనకు సర్పంచ్ జ్యోతి నరసింహ గారు కొబ్బరికాయను కొట్టి భూమిపూజను చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్ నరేష్, వార్డు సభ్యులు రజిత శ్రీనివాస్, జాట్రోత్ లచ్చిరాం, ధరావత్ శంకర్, నాయకులు గుగులోత్ లచ్చిరాం,ధరావత్ పాండు నాయక్,మహిళా అధ్యక్షురాలు కున్సోత్ స్వరూప, కోశాధికారి కున్సోత్ కమలమ్మ, ఖాూ కునుసోత్ సుధాకర్,యుత్ అధ్యక్షుడు నరేష్,మెగావత్ బిచ్చు, పాన్ గోత్ వెంకటేష్, వివిధ నాయకులు,మహిళలు పాల్గొన్నారు...

# వృద్ధుల ముఖాల్లో చిరునవ్వే నిజమైన ఆనందం: బొజ్జల బృందమ్మ





- అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా శివనాధపురం వృద్ధాశ్రమంలో ప్రత్యేక కార్యక్రమం

**తొట్టంబేడు,పెన్ పవర్,అక్టోబర్ 05:**
వయసు పైబడిన వృద్ధులను ఆదరించడం, వారికి ప్రేమానురాగాలను పంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని బొజ్జల బృందమ్మ అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా తొట్టంబేడు మండలం శివనాధపురం గ్రామంలోని అమ్మ అనాథ మహిళా వృద్ధాశ్రమంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బొజ్జల బృందమ్మ వృద్ధుల సంక్షేమం, వారి ప్రాధాన్యతపై ఆకట్టుకునేలా ప్రసంగించారు. జీవిత చరమాంకంలో ఉన్న వృద్ధులకు అమ్మలాంటి నీడను అందిస్తూ, ఆప్యాయతతో ఆదరిస్తున్న ఆశ్రమ నిర్వాహకుల సేవలను ఆమె అభినందించారు.

పెద్దల అనుభవాలు సమాజానికి ఎంతో విలువైన మార్గదర్శకాలని ఆమె పేర్కొన్నారు. వృద్ధులను గౌరవించడం, వారి అవసరాలను గుర్తించి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని సూచించారు. వృద్ధుల ముఖాల్లో చిరునవ్వు తీసుకురావడమే నిజమైన ఆనందమని అన్నారు.

అనంతరం ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు, పౌష్టికాహారం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. వృద్ధులతో కొద్దిసేపు ఆప్యాయంగా ముచ్చటించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధులు బొజ్జల బృందమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధులు, గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చదలవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నాయుడుపేటలో ఉచిత దంత వైద్య శిబిరం





- ,అక్టోబర్ 10న సి.ఎస్.తేజ థియేటర్ ప్రాంగణంలో ఉచిత దంత వైద్య శిబిరం
- కృష్ణతేజ డెంటల్ హాస్పిటల్, సి.వి. యాస్ చారిటబుల్. ట్రస్ట్ ఆధ్వర్యంలో సంయుక్త నిర్వహణలో దంత వైద్య శిబిరం

**పెన్ పవర్ నాయుడుపేట అక్టోబర్ 5**
తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణం, పరిసర గ్రామాల ప్రజల దంత ఆరోగ్య పరిరక్షణ కోసం చదలవాడ చారిటబుల్ ట్రస్ట్, తిరుపతి కృష్ణతేజ డెంటల్ హాస్పిటల్, సీయూఎస్‌కేటీ ప్యానల్ సంయుక్తంగా ఉచిత వైద్య కార్యక్రమాలను నిర్వహించనున్నాయి. అక్టోబరు 5 నుంచి 9 వరకు పట్టణంలోని వార్డులు, గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి దంత, నోటి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. దంత క్షయం, చిగుళ్ల సమస్యలు, నోటి పూతలు, నోటి క్యాన్సర్ ప్రాథమిక లక్షణాలపై ప్రజలకు వైద్య బృందాలు సూచనలు అందిస్తున్నాయి. ప్రాథమిక లక్షణాలు ఉన్నవారిని గుర్తించి అక్టోబరు 10న నిర్వహించే ప్రధాన శిబిరానికి రావాలని సూచిస్తున్నారు. అక్టోబరు 10న నాయుడుపేటలోని సి.ఎస్.తేజ థియేటర్ ప్రాంగణంలో ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉచిత దంత వైద్య శిబిరం జరుగుతుంది. శిబిరంలో దంతాలకు పట్టిన గారను తొలగించడం, పళ్లలోని రంధ్రాలను పూడ్చడం వంటి సేవలు అందిస్తారు. పళ్లు లేని నిరుపేదలకు ఉచితంగా కట్టుడు పళ్లు అమర్చనున్నారు. కదిలిన, పాడైన పళ్లను నొప్పి లేకుండా తొలగించే చికిత్స కూడా అందుబాటులో ఉంటుంది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ ప్రతినిధి వినోద్, వైద్య బృందం కోరారు. నాయుడుపేట పట్టణం, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# పేదల డాక్టర్ ప్రభాకర్ నాయుడికి సోమిరెడ్డి ఘననివాళి





**పెన్ పవర్ నెల్లూరు జిల్లా బ్యూరో అక్టోబర్ 5**
కావలి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ డాక్టర్ ప్రభాకర్ నాయుడు భౌతికకాయానికి నివాళులర్పించిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

మున్సిపల్ చైర్మన్ గా కావలి ప్రజలకు ప్రభాకర్ నాయుడు అందించిన సేవలు ఎనలేనివి

పేదలకు ఉచిత వైద్యం అందించడంతో పాటు మంచి చెయ్యి వాసి గల ప్రజా వైద్యుడిగా ప్రభాకర్ నాయుడు గుర్తింపు పొందారు

డాక్టర్ తో మాకు చాలా అనుబంధం ఉంది..ఈ రోజు ఆయన మా మధ్య లేకపోడాన్ని జీర్ణించుకోలేకపోతున్నాం ప్రభాకర్ నాయుడు ఆత్మకు శాంతి చేకూర్చాలని, కుటుంబసభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాను డాక్టర్ ప్రభాకర్ నాయుడు అంతిమయాత్రలో పాల్గొన్న సోమిరెడ్డి, కావలి ఎమ్మెల్యే కావ్యా కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పోతుగంటి అలేఖ్య తదితరులు

# గ్రామ పునర్నిర్మాణ సంస్థ పరిరక్షణకు ఏకగ్రీవ తీర్మానం




**పెన్ పవర్, అక్టోబర్ 05**
హైదరాబాద్ ప్రాంత నిర్మాణ సంస్థ పరిరక్షణ సమితి సర్వసభ్య సమావేశాన్ని మండలంలోని ప్రశాంతపురి కురుమేడు గ్రామంలోని వీఆర్వో ఆరోగ్య కేంద్రంలో ఆదివారం నిర్వహించారు గ్రామ పుననిర్మాణ సంస్థను పరిరక్షించడంతో పాటు సమస్త వ్యవస్థాపక సంచాలకులు ప్రొఫెసర్ ఎంఏ విండే ఆశయాలను కొనసాగించాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. సమస్త కు చెందిన ఆస్తులను కాపాడడం సంస్థలో గతంలో పనిచేసిన ఉద్యోగుల హక్కులను సాధించడం సమస్త పరిరక్షణ కోసం కలిసి వచ్చే అన్ని మిత్ర సంఘాలను సమన్వయం చేసుకొని సమస్తను సంపూర్ణంగా రక్షించేందుకు ఐక్యంగా ముందుకు సాగాలని సభ్యులు నిర్ణయించారు ఈ సందర్భంగా సమస్త పరిరక్షణకు చేపట్టాల్సిన కార్యాచరణ పై సభ్యులు విస్తృతంగా చర్చించారు. ప్రొఫెసర్ ఎంఏ విండే ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు సమస్త అభివృద్ధి ఆస్తుల పరిరక్షణ ఉద్యోగుల హక్కుల సాధనకు కృషి చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో కేంద్ర కమిటీ ప్రధాన కార్యవర్గ సభ్యులు బి. శ్రీనివాస్, డి. శివప్రసాద్, సునీల్ , హైదరాబాద్ ప్రాంత అధ్యక్షుడు వర్కాల వెంకటేష్, దండు నరసింహ, జల్దా భాస్కర్, సూర్యారావు, లలిత, సునీత, లచ్చిరాం, శక్రు నాయక్, బాలు నాయక్, రవి, చిన్న, కవిత, స్వాతి, శారద, శాంతి, కుమార్ తదితరులతో సుమారు 150 మంది సంఘం సభ్యులతో పాల్గొన్నారు.

# జాతీయస్థాయి కరాటేలో శ్రీకాళహస్తి విద్యార్థుల సత్తా!

**23 మంది క్రీడాకారులు.. ఏకంగా 26 పతకాలు కైవసం**
**06 స్వర్ణాలు.. 09 రజతాలు.. 11 కాంస్యాలు**



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 05:**
నెల్లూరులోని సోమిశెట్టి కల్యాణ మండపంలో నిర్వహించిన 5వ కేనీ శితో ర్యు నేషనల్ లెవెల్ కరాటే ఛాంపియన్షిప్ 2026లో శ్రీకాళహస్తికి చెందిన విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పతకాల పంట పండించారు. జాతీయస్థాయి వేదికపై తమ క్రీడా నైపుణ్యాన్ని చాటుతూ శ్రీకాళహస్తి ఖ్యాతిని మరోసారి చాటిచెప్పారు.

ఈ పోటీల్లో యు -11, యు -14, యు -17, జూనియర్, సీనియర్ విభాగాల్లో క్రీడాకారులు పాల్గొన్నారు. కటా, కుమిటే (ఫైట్) విభాగాల్లో హోరాహోరీగా పోటీపడి తమ ప్రతిభను ప్రదర్శించారు. శ్రీకాళహస్తి నుంచి మొత్తం 23 మంది విద్యార్థులు పాల్గొనగా, ఏకంగా 26 పతకాలు సాధించి సత్తా చాటారు. **పతకాల వివరాలు** బంగారు పతకాలు 06. వెండి పతకాలు 09,కాంస్య పతకాలు 11 జాతీయస్థాయిలో సాధించిన ఈ ఘన విజయం విద్యార్థుల కృషి, క్రమశిక్షణ, పట్టుదలకు నిదర్శనంగా నిలిచింది. చిన్న వయసులోనే కరాటేలో ప్రతిభను చాటుతూ శ్రీకాళహస్తి యువ క్రీడాకారులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేందుకు బాటలు వేసుకున్నారు.

ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు, కోచ్‌లు, శ్రీకాళహస్తి కరాటే యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తూ విజేతలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయితో పాటు అంతర్జాతీయ పోటీల్లోనూ రాణించి శ్రీకాళహస్తికి మరింత పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

జాతీయ కరాటే వేదికపై శ్రీకాళహస్తి విద్యార్థుల ప్రతిభకు పలువురు అభినందనలు తెలిపారు.

# రగ్బీలో రాష్ట్రస్థాయి పోటీలకు పెద్ద కనపర్తి విద్యార్థి ఎంపిక



**శ్రీకాళహస్తి రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 05:**
మండలంలోని పెద్ద కనపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కె. గురులోకేష్ రగ్బీ క్రీడలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లమాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన అండర్17 బాలుర విభాగం రగ్బీ ఎంపిక పోటీల్లో గురులోకేష్ ప్రతిభను ప్రదర్శించి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. సుబ్రమణ్యం, ఓ. ప్రసాద్, వ్యాయామ దర్శకుడు ఎం. చంగల్ రాయలు తెలిపారు.ఎంపికైన గురులోకేష్ ఈ నెల 11, 12 తేదీల్లో కాకినాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రగ్బీ క్రీడా పోటీల్లో పాల్గొననున్నట్లు వారు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి రగ్బీ క్రీడలో రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పాఠశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా గురులోకేష్‌ను పాఠశాల ఉపాధ్యాయ బృందం, కమిటీ సభ్యులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# ఉదయానంద హాస్పిటల్ దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్... రూ.1,30,000/- నగదు స్వాధీనం



**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 05**
నంద్యాల మూడో టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెంబర్ .80/2026 యూ /స్ 303(2) బి.ఎన్.ఎస్ కేసులో ఉదయానంద హాస్పిటల్‌లో నగదు దొంగతనం చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి రూ.1,30,000/- నగదును స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు 04 వ తేదీ 10 వ నెల 2026 తేదీన సాయంత్రం నంద్యాల పట్టణంలోని నూనెపల్లే ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ క్రింద కోవెలకుంట్ల బస్ స్టాప్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న కంభం వెంకటరెడ్డి, తండ్రి ప్రతాప్ రెడ్డి, వేంపల్లి గ్రామం, కడప జిల్లాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు 19/20వ తేదీ 09 వ నెల 2026 రాత్రి నంద్యాల రైల్వే స్టేషన్ సమీపంలోని ఉదయానందా హాస్పిటల్ క్యాష్ కౌంటర్ నుండి రూ.1,40,000/- నగదును దొంగిలించినట్లు వెల్లడించాడు. నిందితుడి వద్ద ఉన్న రూ.1,30,000/- నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన రూ.10,000/-ను తన వ్యక్తిగత ఖర్చులకు మరియు క్రికెట్ బెట్టింగ్‌కు వినియోగించినట్లు నిందితుడు వెల్లడించాడు. అదేవిధంగా, గిద్దలూరు పట్టణంలోని డిజిఆర్ హాస్పిటల్ లో కూడా దొంగతనం చేసినట్లు నిందితుడు వెల్లడించాడు. గతంలో నెల్లూరు జిల్లా బాలాజీనగర్ పోలీస్ స్టేషన్ మరియు పులివెందుల పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ఇలాంటి దొంగతనం కేసుల్లో నిందితుడిపై పలు కేసులు నమోదైనట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడిని 04.10.2026 న సాయంత్రం 5.00 గంటలకు అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి స్వాధీనం చేసుకున్న రూ.1,30,000/- నగదును కేసు తదుపరి దర్యాప్తు నిమిత్తం పోలీసుల స్వాధీనంలోకి తీసుకున్నారు.

ఈ కేసులో నిందితుడిని గుర్తించి పట్టుకోవడంలో గౌరవనీయులైన ఎస్పి సునీల్ షెరాన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, ఏఎస్పి ర్ . సుస్మిత, ఐపీఎస్ పర్యవేక్షణలో, నంద్యాల మూడవ టౌన్ పోలీస్ సిబ్బంది,సీసీస్ ఇన్‌స్పెక్టర్ సురేష్ మరియు వారి సిబ్బందితో కలిసి సమన్వయంతో కృషి చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మరియు ఏఎస్పీ పోలీస్ సిబ్బంది చేసిన కృషిని అభినందించారు. కేసును ఛేదించడంలో సమర్థవంతంగా పనిచేసిన నంద్యాల మూడవ టౌన్ పోలీస్, సీసీస్ ఇన్‌స్పెక్టర్ సురేష్, వారి సిబ్బందిని అభినందించారు.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పోలీసుల పర్యవేక్షణ





**పెళ్లకూరు, పెన్ పవర్, అక్టోబర్ 05**
స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా నాయుడుపేట డీఎస్పీ, నాయుడుపేట రూరల్ సీఐ, పెళ్లకూరు ఎస్సై తదితర పోలీసు అధికారులు వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.పెళ్లకూరు మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాలను పోలీసు అధికారులు ప్రత్యేకంగా పరిశీలించారు.

పోలింగ్ కేంద్రం పరిసర ప్రాంతాలను పరిశీలించి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు, ఓటర్ల రాకపోకలు, శాంతిభద్రతల పరిస్థితిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా భద్రత కల్పిస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి

గొడవలు, వివాదాలు, అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసు శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. ప్రజలు కూడా ఎన్నికల నిబంధనలకు సహకరించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అనుమానాస్పద వ్యక్తులు లేదా సమస్యాత్మక పరిస్థితులు కనిపిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని అధికారులు ప్రజలను కోరారు.

# మన్నవరపాడు గ్రామాలలో 1కోటి 55 లక్షల రూపాయల వ్యయంతో సీ.సీ. రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన గుండ్లపాలెం పి.ఎ.సి.ఎస్. సొసైటీ చైర్మన్ పముజుల ప్రదీప్.





**పెన్ పవర్ నెల్లూరు జిల్లా బ్యూరో అక్టోబర్ 5**
నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని సౌత్ మోపూర్ మరియు మన్నవరపాడు గ్రామాలలో 1కోటి 55 లక్షల రూపాయల వ్యయంతో సీ.సీ. రోడ్ల పనులకు శంకుస్థాపన చేసిన గుండ్లపాలెం పి.ఎ.సి.ఎస్. సొసైటీ చైర్మన్ పముజుల ప్రదీప్. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.

నెల్లూరు రూరల్ నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది. గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుంది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిప్రజలకు అవసరమైన రహదారులు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూ, గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాము. ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులను చేపడుతున్నాం. తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గారి ఆశీస్సుల్లతో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ లో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి జరుగుతోంది. తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.

అతి త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే కూటమి అభ్యర్థులకు ఓటు వేసి విజయాన్ని అందించండి. తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.

పై కార్యక్రమంలో శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహస్వామి దేవస్థానం ఛైర్మెన్ ఇందుపూరు అచ్యుత్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ మండల ఇంచార్జ్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ జలదంకి సుధాకర్, మాజీ ఎంపీటీసీ రాపూరు చెంచమ్మ , తెలుగుదేశం పార్టీ నాయకులు మల్లినేని వేణుగోపాల్, అల్లాబక్షు, వాకా వెంకటేశ్వరులు, మన్నవరపు భాస్కర్, అన్నం సుధాకర్ గౌడ్, గుంజి రవి, బండ్ల గోపాలయ్య, పన్నెం సునీల్, రాపూరు వెంకయ్య, రాపూరు రవి, పముజుల తేజేష్, శ్యామ్ కుమార్, అంతటి గోపి, బండి శీనయ్య, మేకల శివయ్య, వంగపూడి శివయ్య, బద్దిపూడి నాగేంద్ర అశోక్, వెంకటేశ్వర్ నాయుడు, ఎన్.రాజారావు, గంగయ్య, మురళి, రఘురామయ్య, వెంకటరమణమ్మ, సయ్యద్ బాబు, మస్తానయ్య మరియు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# యూటర్న్ తీసుకున్న చంద్రబాబు, పవన్..
# పులివెందుల పర్యటనలో మార్పు



**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంయుక్తంగా నిర్వహించిన కడప జిల్లా పర్యటన రాజకీయంగా హాట్ టాపిక్ అవుతోంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి సొంత జిల్లా కావడంతో ఈ పర్యటన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం జగన్ రెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులలో కాకుండా చంద్రబాబు, పవన్ కార్యక్రమం ప్రొద్దుటూరు నియోజకవర్గంలో సాగడంపైనే విస్తృత చర్చ జరుగుతోంది. పులివెందుల పర్యటనకు వస్తారనగా, అందుకు రెండు రోజుల ముందు సీఎం, డీసీఎం టూర్ షెడ్యూల్ మారిపోవడంపై పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

జలజీవన్ మిషన్ అమరజీవి జలధార 2.0 కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కడప జిల్లాలో పర్యటించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.30,156 కోట్ల వ్యయంతో జలధార పనులు చేపడుతున్నారు. ఇందుకు ప్రొద్దుటూరులో పైలాన్ ఆవిష్కరించారు. వచ్చే మూడేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో ఇంటింటికి తాగునీరు సరఫరా చేయాలనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. అయితే ముందుగా జలధార 2.0 కార్యక్రమాన్ని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులలో నిర్వహించాలని భావించారు. పులివెందుల ఎమ్మెల్యేగా జగన్ ను ఆహ్వానించి, వేదికపై నుంచి ఆయనను ఇరుకన పెట్టే కార్యక్రమానికి డిజైన్ చేశారని చెబుతున్నారు. ఇక ముఖ్య నేతలు ఇద్దరూ పులివెందుల పర్యటనకు సిద్ధమవడం రాజకీయంగా వేడెక్కించింది. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే జగన్ సొంత ఇలాకాలో చంద్రబాబు, పవన్ వెళుతున్నారని ప్రచారం జరిగింది. ఇక ఇప్పటికే పలు అంశాల్లో జగన్ ను టార్గెట్ చేస్తున్న కూటమి ప్రభుత్వ అధినేతలు పులివెందులలో ఏ రాజకీయ బాంబు పేల్చుతారో అంటూ అంతా ఉత్కంఠగా ఎదురుచూశారు. కానీ, ఏమైందో ఏమో అనూహ్యంగా పులివెందుల కార్యక్రమాన్ని ప్రొద్దుటూరుకు మార్చేశారు. దీంతో కూటమి కార్యకర్తలు తీవ్ర నిరాశను వ్యక్తం చేశారు. మరోవైపు పులివెందుల కార్యక్రమం అంటూ హడావుడి చేసిన ప్రభుత్వం వెనక్కి తగ్గడంపై అనేక విధాలుగా చర్చ జరుగుతోంది.

అయితే పులివెందులలో జలజీవన్ మిషన్ కార్యక్రమం ఉంటుందని అధికారికంగా ప్రకటన చేయలేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కడప జిల్లాలో కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం భావించిందని, ఇందుకోసం పలు నియోజకవర్గాలను పరిశీలించామని మాత్రమే చెబుతున్నారు. సీనియర్ ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి స్వయంగా ఆహ్వానించడంతో

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రొద్దుటూరులో ఏర్పాటు చేశారని అంటున్నారు. అయితే పులివెందుల పర్యటన వాయిదా వేయడానికి ఇంకో కారణం ఉందని స్థానికంగా ఒక ఆసక్తికర అంశం ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి గత నెల 30న పులివెందులలో ఈ కార్యక్రమం నిర్వహించాలని భావించారని, ఇందుకోసం పులివెందులలో తాగునీటి గ్రిడ్ ప్రాజెక్టు పనులు శరవేగంగా చేపట్టారని అంటున్నారు. అయితే కార్యక్రమం నిర్వహించాల్సిన సమయంలో ప్రధానమైన చిత్రావతి రిజర్వాయర్ లో నీరు లేకపోవడంతో కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారని అంటున్నారు. నీళ్లు లేకుండా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు ప్రారంభిస్తే విమర్శలు ఎదుర్కోవాల్సివస్తుందనే ఆలోచనతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో గండికోట జలాశయం వద్దకు కార్యక్రమానికి మార్చారని అంటున్నారు. ఇక సీనియర్ ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి కూడా కార్యక్రమం నిర్వహించేందుకు ఉత్సాహం చూపడంతో సీఎం, డిప్యూటీ సీఎం ప్రొద్దుటూరు పర్యటనకు మొగ్గుచూపారని చెబుతున్నారు.

# మాధవ్ కెపాసిటీ, క్యాలిబర్ కు ఇది ఒక టెస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కు విశాఖ లోకల్ బాడీ ఎన్నికల టెన్షన్ పట్టుకుంది. మాధవ్ సొంత ప్రాంతం కావడంతో ఇక్కడ పట్టు నిలుపుకోవడం ఆయనకు అవసరంగా కనిపిస్తుంది. ఇప్పటికే మాధవ్ కు స్థానిక బీజేపీ నేతల నుంచి వత్తిడి పెరుగుతోంది. విశాఖ మేయర్ పదవిని బీజేపీ దక్కేలా చూడాలని కార్యకర్తల నుంచి ప్రెషర్ పెరుగుతోంది. అందుకే మాధవ్ తమకు గత అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించిన పొత్తులతో సంబంధం లేకుండా విశాఖ కార్పొరేషన్ కేటాయించాలని మాధవ్ కోరే అవకాశాలున్నాయి. సొంత ప్రాంతంలో పట్టు నిలుపుకో లేకపోతే ఇటు పార్టీలో అటు నాయకత్వంలోనూ పరువు పోతుంది. అందుకే మాధవ్ ఎలాగైనా పట్టుబట్టి విశాఖ మేయర్ స్థానాన్ని బీజేపీకి దక్కించుకునేలా చూడాలని భావిస్తున్నారు. ఇప్పటికే మాధవ్ దీనిపై ఒక ప్రకటన కూడా చేయడంతో ఆయన కూటమి సమావేశంలో కొంత కటువుగానే మాట్లాడే అవకాశాలు ఉండొచ్చన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయంగా వినిపిస్తుంది.

**టీడీపీ కూడా బలంగా...**

ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు విశాఖపట్నం స్థానిక సంస్థలు మరియు జీవీఎంసీ మేయర్ పీఠంపై కూటమిలో నెలకొన్న రాజకీయ పోరు ఉత్కంఠను రేపుతోంది. విశాఖపట్నంలో జీవీఎంసీ మేయర్ పదవిని దక్కించుకోవాలని బీజేపీ గట్టిగా ప్రయత్నిస్తుండగా, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ పార్టీ కూడా పట్టుదలగా ఉంది. మరొకవైపు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిది కూడా విశాఖపట్నమే కావడంతో కొంత పట్టుబట్టే అవకాశాలున్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో భాగంగా విశాఖలో సీట్ల సర్దుబాటు, మేయర్ స్థానం ఎవరికి దక్కుతుందనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఎవరిని ఎవరు ఒప్పించగలరు? అన్న దానిపై మాధవ్ కెపాసిటీ, క్యాలిబర్ లు ఆధారపడి ఉంటాయన్నది పార్టీ నేతల నుంచి కార్యకర్తలు వరకూ అంటున్న కామెంట్స్.

**మాధవ్ వ్యూహం ఇదే అయినా...**

విశాఖ కేంద్రంగా పార్టీని బలోపేతం చేస్తూ, ప్రతి గ్రామం, వార్డు స్థాయిలో బీజేపీ జెండా ఎగరాలని, స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని కేడర్‌కు పీవీఎన్ మాధవ్ దిశానిర్దేశం చేశారు. మేయర్ స్థానానికి పోటీపై తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. అయితే మాధవ్ మాటకు ఎంత మేరకు టీడీపీ నుంచి సానుకూలత లభిస్తుందన్నది సందేహమే. ఎందుకంటే విశాఖపట్నంలో అనేక పరిశ్రమలు వస్తున్నాయి. అక్కడ మేయర్ పీఠంపై టీడీపీ ఇప్పటికే గురి పెట్టి ఉంది. అతి పెద్ద కార్పొరేషన్ కావడంతో ఈ స్థానాన్ని వదులుకునేందుకు విశాఖ టీడీపీ నేతలతో పాటు పార్టీ నాయకత్వం కూడా సిద్ధంగా ఉండకపోవచ్చు. బీజేపీ కేంద్ర నాయకత్వం జోక్యం చేసుకుంటుందా? లేదా? అన్నది ఇప్పుడే చెప్పలేం. ఎందుకంటే స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో ఢిల్లీ జోక్యం అంతగా ఉండదంటున్నారు. మరి మాధవ్ వల్ల మేయర్ అభ్యర్థిత్వం బీజేపీకి దక్కితే కొంత వరకూ ఆయన విజయం సాధించినట్లే. ఇక గెలుపోటములు కూడా ఆయనకు మరొక సవాలుగా మారే అవకాశముంది.

# బీసీ రిజర్వేషన్లు ...ఓటు బ్యాంక్ డ్రామాలు

**విజయవాడ, అక్టోబరు 5, పెన్ పవర్:**

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన జీవోలను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీల మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సర్వోన్నత న్యాయస్థానం నిబంధనలకు ఈ జీవోలు విరుద్ధమని స్పష్టం చేస్తూ, ఆరు వారాల్లో ప్రక్రియ ప్రారంభించి ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించింది. అయితే, ఈ తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్తామని సీఎం చంద్రబాబు ప్రకటించినప్పటికీ, న్యాయపరంగా ఇది నిలబడదని తెలిసి కూడా వేస్తున్న రాజకీయ ఎత్తుగడగానే స్పష్టమవుతోంది. రాజ్యాంగబద్ధమైన పరిమితులను అధిగమించి రిజర్వేషన్లు కల్పించడం సాధ్యం కాదని రాజ్యాంగ ధర్మాసనాలు ఎన్నోమార్లు స్పష్టం చేశాయి. సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది. స్థానిక సంస్థల్లో రాజకీయోచిత వెనుకబాటుతనాన్ని నిర్ధారించేందుకు త్రిసభ్య కమిషన్ ద్వారా ట్రిపుల్ టెస్ట్ నిర్వహించకుండా , 50 శాతం సీలింగ్‌ను దాటుకుని ఏ రాష్ట్రమూ రిజర్వేషన్లు పొడిగించకూడదని పేర్కొంది. ఈ తీర్పులు ఉన్నప్పటికీ 34 శాతం కోటాతో జీవోలు తెచ్చి, అది కోర్టుల్లో చెల్లదని తెలిసీ సుప్రీంకోర్టుకు వెళ్లడం కేవలం రాజకీయ వ్యూహాల్లో భాగంగానే జరుగుతోంది. ఈ తరహా రాజకీయ వ్యూహాలు తెలుగు రాష్ట్రాలకు కొత్తవేమీ కావు. ఉమ్మడి ఏపీ సమయం నుంచి మొన్నటి తెలంగాణ పంచాయతీ ఎన్నికల వరకు కూడా ప్రభుత్వాలు 50 శాతానికి మించి బీసీ కోటాను పెంచుతూ నిర్ణయాలు తీసుకోవడం, న్యాయస్థానాలు వాటిని అడ్డుకోవడం క్రమబద్ధమైన పరిణామంగా మారింది. తెలంగాణలోనూ బీసీ రిజర్వేషన్లపై గతంలో తెచ్చిన ఆర్డినెన్సులు కోర్టుల్లో నిలబడలేక చివరకు 50 శాతం లోపే ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. ప్రభుత్వాలు రాజ్యాంగ నిపుణుల సలహాలు తీసుకోకుండా లేదా తెలిసీ విస్మరించి, ఎన్నికల ముందు భారీ రిజర్వేషన్ల హామీలు ఇవ్వడం ఒక అనవసర సంప్రదాయంగా మారింది. ఈ తరహా పరిమితికి మించిన రిజర్వేషన్ల హామీలు వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ఇచ్చేవి కావు. ఇవి ప్రధానంగా ఓటు బ్యాంకులను ఆకట్టుకునేందుకు ఆడే రాజకీయ క్రీడ. బీసీ వర్గాల్లో అత్యాశలు, ఆకాంక్షలు రేకెత్తించడం, ఆపై జీవోలను సిద్ధం చేయడం, న్యాయస్థానాలు రాజ్యాంగ చట్రంలో వాటిని కొట్టేయగానే మేము బీసీలకు న్యాయం చేయాలని చూశాం, కానీ కోర్టులు అడ్డుకున్నాయి అంటూ సానుభూతి పొందేందుకు ప్రయత్నించడం రాజకీయ పార్టీల పరిపాటిగా మారింది. దీనివల్ల అసలైన లబ్ధిదారులకు న్యాయం జరగకపోగా, స్థానిక సంస్థల ఎన్నికలు సుదీర్ఘకాలం పాటు వాయిదా పడి స్థానిక పాలన స్తంభించిపోతోంది. వాస్తవానికి, బీసీలకు స్థానిక సంస్థల్లో చట్టబద్ధమైన అధిక ప్రాతినిధ్యం కల్పించాలనే నిజమైన చిత్తశుద్ధి ప్రభుత్వాలకు ఉంటే, ముందుగా ట్రిపుల్ టెస్ట్ ద్వారా క్షేత్రస్థాయి డాటాను సేకరించి, రాజ్యాంగ సవరణల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. లేదా 50 శాతం పరిమితికి లోబడే బీసీలకు గరిష్టంగా లబ్ధి చేకూరేలా సీట్ల కేటాయింపు చేయాలి. కానీ, ఆచరణాత్మక పరిష్కారాలను విస్మరించి, న్యాయపోరాటం పేరుతో కాలయాపన చేయడం వల్ల సమయం, ప్రజాధనం వృథా కావడం తప్ప మరే ఫలితం ఉండదు. హైకోర్టు తీర్పు ను బట్టి చూస్తే సుప్రీంకోర్టుకు వెళ్లినా ఏపీ ప్రభుత్వానికి ఉపశమనం లభించే అవకాశాలు అత్యల్పం. కాబట్టి కోర్టుల వల్ల జరగలేదనే రాజకీయ నెపం నెట్టడం ఆపి, సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితికి లోబడి ఎన్నికల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయడమే ప్రజాస్వామ్య బద్ధమైన మార్గం. బీసీ సమాజం కూడా కేవలం కాగితాలపై ఇచ్చే 34 శాతం హామీల కంటే, చట్టబద్ధంగా అమలుకు సాధ్యమయ్యే ప్రాతినిధ్యంపైనే స్పష్టమైన రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

**డేటాను పూర్తిగా పరిశీలించకుండానే**

2025 డిసెంబర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ సర్వే నిర్వహించింది. రాష్ట్ర జనాభా, సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగం, ఇళ్లు, ఆస్తుల స్థితిగతులతో పాటు అన్ని కీలక వివరాలను సేకరించింది. 2026 జూన్‌లో ఈ వివరాలను స్థానిక సంస్థల ముందుంచి ప్రజలు వెరిఫై చేసుకునే అవకాశం కల్పించింది. మొత్తం 39 అంశాలపై సామాజిక ధ్రువీకరణ చేపట్టారు. ఈ డేటా ఆధారంగా రాష్ట్ర జనాభాలో బీసీలు దాదాపు 50.42% (గ్రామీణ ప్రాంతాల్లో 48.84%, పట్టణాల్లో 54.35%) ఉన్నట్లు తేలింది. ఈ మేరకు బీసీలకు పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 1/3వ వంతు, గ్రామీణ స్థానిక సంస్థల్లో 34% రిజర్వేషన్లు కల్పించడానికి రెండు జీవోలను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. అయితే, సుప్రీంకోర్టు గతంలో కె.కృష్ణమూర్తి, వికాస్ కిషన్‌రావ్ గావ్లీ, సురేష్ మహాజన్, బిర్రు ప్రతాప్‌రెడ్డి కేసుల్లో ఇచ్చిన తీర్పు ప్రకారం రిజర్వేషన్లు 50%కి మించకూడదంటూ ప్రతివాదులు ఈ జీవోలను హైకోర్టులో సవాల్ చేశారు. ఆ తీర్పులు వెలువడే నాటికి, నేటికీ పరిస్థితులు మారాయని సమగ్ర కుటుంబ సర్వే తేల్చిందని రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. రాజకీయ రిజర్వేషన్లను కేవలం జనాభా ఆధారంగా కాకుండా సామాజిక, ఆర్థిక పరిస్థితుల ఆధారంగా చేపడుతున్నట్లు హైకోర్టుకు వివరించినట్లు ప్రభుత్వం తెలిపింది. అయినప్పటికీ రిజర్వేషన్లు 50%కి మించకూడదన్న కారణంతో హైకోర్టు ఆ రెండు జీవోలను రద్దు చేసింది. కె.కృష్ణమూర్తి, వికాస్ గావ్లీ కేసుల్లో తీర్పులను లోతుగా విచారించి సేకరించిన డేటా అందుబాటులో ఉంటే రిజర్వేషన్లు 50 శాతం మించొచ్చు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ సర్వే ద్వారా సేకరించిన సమాచారాన్ని స్థానిక సంస్థలన్నీ ధ్రువీకరించాయి. ఆ ప్రక్రియ సరిగా జరిగిందా లేదా అని పరిశీలించడానికి బదులు హైకోర్టు దాన్ని పూర్తిగా రద్దు చేయడం సరికాదని సుప్రీంకోర్టు పిటిషన్‌లో పేర్కొంది. రిజర్వేషన్లపై 50% పరిమితి అన్నివేళలా తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనేమీ కాదని 'జనహిత్ అభియాన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొందని ఏపీ ప్రభుత్వం గుర్తుచేసింది. స్థానిక సంస్థల పాలక వర్గాల కాలపరిమితి ముగిసిపోయిన నేపథ్యంలో ఎన్నికలు పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల ఖరారుకు తగిన కసరత్తు చేసిందని, కేవలం జనాభా ప్రాతిపదికన ఉజ్జాయింపుగా బీసీలకు 34% రిజర్వేషన్లను ఖరారు చేయలేదని స్పష్టం చేసింది.

## సవాళ్లతో ఏకం... సాధ్యమేనా

**విజయవాడ, అక్టోబరు 5, పెన్ పవర్:** దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఏపీ ఎన్నికల్లో తన సర్వేల ద్వారా సోషల్ మీడియాలో క్రేజ్ సంపాదించిన 'కేకే సర్వేస్' అధినేత కిరణ్ కొండేటి ఇప్పుడు డైరెక్ట్ రాజకీయాల్లోకి రంగప్రవేశం చేస్తున్నారు. ఇప్పటివరకు తెరవెనుక కూర్చుని ఓట్ల శాతం, సీట్ల అంచనాలు చెప్పిన ఆయన, ఇకపై ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా విజయవాడలోని ఓ స్టార్ హోటల్‌లో ప్రత్యేకంగా మీటింగ్ ఏర్పాటు చేసి 'ఏకం' అనే కొత్త రాజకీయ పార్టీని అధికారికంగా ప్రకటించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆసక్తి, అర్హత ఉన్న సాధారణ ప్రజలను ప్రోత్సహించడమే ఈ 'ఏకం' పార్టీ ప్రధాన లక్ష్యమని కిరణ్ తెలిపారు. కుల, మత, జాతి భేదాలకు అతీతంగా ప్రజలను ఒకే వేదికపైకి తెచ్చి రాజకీయాల్లోకి తీసుకురావడమే తన ధ్యేయమన్నారు. పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికల నుంచి మొదలుపెట్టి, భవిష్యత్తులో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఏకం అభ్యర్థులు పోటీ చేస్తారని ఆయన స్పష్టం చేశారు. గతంలో కొన్ని ఎన్నికల ఫలితాలను అంచనా వేసి లైమ్‌లైట్‌లోకి వచ్చిన కిరణ్ కొండేటి, ఆ తర్వాత ఇచ్చిన కొన్ని సర్వే అంచనాలు తలకిందులు కావడంతో సోషల్ మీడియాలో విమర్శలు ఎదుర్కొన్నారు. సర్వేల పేరుతో ప్రజల ముందుకు వెళ్తే ఇక ఫలితం ఉండదనే వాస్తవాన్ని గుర్తించే ఈసారి నేరుగా రాజకీయాల్లోకి వస్తున్నారని ప్రచారం సాగుతోంది. ఏపీలోని స్థానిక సంస్థల ఎన్నికలంటే గ్రామస్థాయిలో గ్రూప్ తగాదాలు, బలమైన కేడర్, భారీగా డబ్బుతో ముడిపడి ఉండే సున్నితమైన అంశం. కేవలం ఒక వేదికను సృష్టించి ఆసక్తి ఉన్నవారికి అవకాశం ఇస్తే సరిపోదని, క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని నడపడం, ఎన్నికల ఖర్చులను భరించి గెలవడం అంత తేలికైన విషయం కాదనే ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. సర్వేల పేరిట సోషల్ మీడియాలో క్రేజ్ సంపాదించిన ఆయన..కొత్త రాజకీయ ప్రయాణంలో ఏ మేరకు రాణిస్తారనేది వేచి చూడాలి.

## అప్పాజీపేటలో అర్ధరాత్రి మిస్టరీ

**అనంతపురం అక్టోబరు 5, పెన్ పవర్:** అనంతపురం జిల్లాలో అప్పాజీపేటలో వారం రోజులుగా గాల్లోంచి రాళ్లు పడుతున్నాయి. అవి ఎక్కడ నుంచి వస్తున్నాయో.. ఎలా పడుతున్నాయో అర్థం కాక గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. పోలీసులు నిఘా పెట్టిన సమయంలో ఈ రాళ్లు పడ్డాయి. దీంతో ఇది ఏ దెయ్యం పనో అని గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్వామిజీల దగ్గరకు పరుగులు తీస్తున్నారు. అయితే ఆకతాయిల పని అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నట్టు తెలుస్తుంది. ప్రజలు మాత్రం రాత్రిపూట నిద్రపోలేకపోతున్నామని, ఈ సమస్యను త్వరగా పరిష్కరించమని కోరుతున్నారు. అనంతపురం జిల్లాలో అప్పాజీపేటలో ఓ వింత పరిస్థితి నెలకొంది. ఆ గ్రామంలో వారం రోజులుగా గాల్లోంచి రాళ్లు పడుతున్నాయి. ఈ పరిణామంతో రాత్రైతే చాలు వణికిపోతున్న జనం.. ఆ ఊర్లో ఉండాలంటే భయపడిపోతున్నారు. ఈ ఘటన వల్ల ఇప్పటికే చాలా ఇళ్లు డ్యామేజ్ అయ్యాయి. ఇళ్ల పైకప్పులు పగిలిపోయాయి. ఆ రాళ్లు ఎక్కడ నుంచి వస్తున్నాయో తెలియక ఆ ఊరి ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. రాత్రి పూట అందరూ ఒకే చోటకు చేరుతున్నారు. ఈ విషయంపై ప్రజలు రకరకాలుగా ఆలోచనలు చేస్తున్నారు. ఎవరైనా కావాలనే చేస్తున్నారా? దైవం పనా? దెయ్యం పనా? అనే ఊహాగానాలు జోరందుకున్నాయి. ఈ బాధ భరించలేక ప్రజలు చివరి పోలీసులను ఆశ్రయించారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న తర్వాత నలుగురు పోలీసులు ఆ గ్రామంలో గస్తీ కూడా నిర్వహించారు. ఆ సమయంలో కూడా గాల్లోంచి రాళ్లు పడ్డాయి. అయినా ఫలితం లేకపోయింది. ఈ విషయంపై ప్రజలు స్వామీజీల దగ్గరకు పరుగులు తీస్తున్నారు. పోలీసులతో పాటు సుమారు 20 మంది యువకులు కూడా ఈ మిస్టరీని ఛేదించడానికి కొండపైకి వెళ్లి పరిశీలించారు. అప్పుడు కూడా ఇళ్లపై రాళు వచ్చి పడ్డాయి. దీంతో ఆ గ్రామ ప్రజలు ఇది కచ్చితంగా అదృశ్య శక్తుల పనే.. అని అనుమానిస్తున్నారు. అయితే అలాంటి దానికి ఆస్కారం లేదని, ఇది ఆకతాయిలు చేస్తున్న పనిగా కనిపిస్తుందని పోలీసులు భావిస్తున్నట్టు సమాచారం. ఇందులో భాగంగానే పోలీసులు నిఘా ఉన్న సమయంలో రాళ్లు ఎలా పడుతున్నాయో గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. కొందరు వ్యక్తులే కావాలనే రాళ్లు విసురుతూ భయాందోళనకు గురి చేస్తున్నారా? దీనికి ఇంకేదైనా కారణముందా? అనే కోణంలో దర్యాప్తు సాగుతుంది. అయితే రాళ్ల దాడి వల్ల ప్రజలు రాత్రిళ్లు ప్రశాంతంగా నిద్రపోలేకపోతున్నారు. ఎక్కువగా సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు రాళ్లు పడ్డాయని స్థానికులు చెబుతున్నారు. చాలామంది గ్రామానికి వచ్చి వీడియోలో, ఫోటోలు తీసుకెళ్తున్నారని కానీ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. దీంతో తమకు భద్రత కల్పించాలని గ్రామస్థులు పోలీసులను కోరుతున్నారు. అయితే తెలుగు రాష్ట్రాల్లో కూడా ఇలా జరిగిన ఘటనలు అనేకం జరిగాయి. ప్రకాశం జిల్లా, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలోని గ్రామాల్లో అచ్చం ఇలాగే రాత్రైతే ఇళ్లపై రాళ్లు పడేవి. 'జన విజ్ఞాన వేదిక' ప్రతినిధులు, పోలీసులు నైట్ విజన్ కెమెరాలు పెట్టి దర్యాప్తు చేశారు. ఆ విచారణలో గ్రామస్థులే ఆస్తి తగాదాల వల్ల ఈ రాళ్లు విసిరినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో అప్పాజీపేటలో కూడా పోలీసులు సాధారణ గస్తీని నిర్వహించే బదులు సీసీ కెమెరాలు, డ్రోన్లు లేదా నైట్ విజన్ కెమెరాలు ఉపయోగిస్తే ఈ రాళ్ల వాన మిస్టరీ త్వరగా వీడే అవకాశం ఉంటుంది.

## వారంలో ఎన్నికల నోటిఫికేషన్

**గుంటూరు అక్టోబరు 5, పెన్ పవర్:** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు దాదాపుగా పూర్తి చేసాయి. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నగారా మోగించేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. ఈ నెల 7న అమరావతి నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్... అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు , పోలీస్ కమిషనర్లతో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. సమావేశంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన క్షేత్రస్థాయి సంసిద్ధతను కమిషన్ నిశితంగా పరిశీలించనుంది. ఓటర్ల జాబితా ఖరారు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, బ్యాలెట్ బాక్సులు లభ్యత, ఎన్నికల నిర్వహణా సిబ్బంది కేటాయింపు , సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు వంటి అంశాలపై కలెక్టర్లు, ఎస్పీలకు ఎస్ఈసీ స్పష్టమైన దిశానిర్దేశం చేయనుంది. నిష్పాక్షికంగా, పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయడమే లక్ష్యంగా యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తున్నారు. కలెక్టర్లు, ఎస్పీల భేటీ ముగిసిన వెంటనే... ఈ నెల 8 లేదా 9 తేదీల్లో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎస్ఈసీ అధికారికంగా విడుదల చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న మొదటి స్థానిక పోరు కావడంతో అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కూటమి తమ పట్టును మరింత బలోపేతం చేసుకోవాలని భావిస్తుంటే... ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయిలో పుంజుకోవడానికి ఈ ఎన్నికలను సవాలుగా తీసుకుంటోంది. సుప్రీంకోర్టులో బీసీ రిజర్వేషన్లపై ఎలాంటి తీర్పు వచ్చినా దానికి తగ్గట్లుగా నోటిఫికేషన్ ఇవ్వనున్నారు

## వైసీపీకి అభ్యర్థుల కష్టాలు

**నెల్లూరు, అక్టోబరు 5, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీకి అనేక ఇబ్బందులున్నాయి. అభ్యర్థుల ఎంపిక నుంచి వ్యయంతో పాటు అధికార పార్టీని ఎదుర్కొనడం అంత సులువుకాదు. మంచి అభ్యర్థులున్నా అధికార పార్టీని తట్టుకోవడం అంత ఈజీ కాదు. ఎందుకంటే.. అన్ని వైపుల నుంచి వత్తిడులు ఉంటాయి. ప్రజలు సహజంగా అధికార పార్టీ కి మద్దతుగా నిలిచేందుకు ఇష్టపడతారు. దీంతో ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో అభ్యర్థుల వ్యయం కూడా వైసీపీకి ఇబ్బందిగా మారనుంది. మరొకవైపు పోలీసు కేసులు, ఇతర ఇబ్బందులు పార్టీ కార్యకర్తలను పోలింగ్ కేంద్రాల వద్దకు రావడం కూడా అంత సులువు కాదు. ఇవన్నీ అధిగమించడంతో పాటు ఓటర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు ఇబ్బందులు కలగొచ్చు. ఆంధ్రప్రదే హైకోర్టు తీర్పు వెలువరించడం మరియు క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితుల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఎదుర్కొంటున్న ప్రధాన ఇబ్బందులు, సవాళ్లు అనేకం ఉన్నాయి. ఎన్నికల వాయిదా ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తయ్యే వరకు ఎన్నికలు నిర్వహించకూడదని వైసీపీ వేసిన పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఆరు వారాల్లోపు ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించడంతో వైసీపీ వ్యూహానికి ఎదురుదెబ్బ తగిలింది. గత సార్వత్రిక ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ క్యాడర్‌లో ఇంకా పూర్తి స్థాయిలో మనోధైర్యం రాలేదని, క్షేత్రస్థాయిలో నాయకులు, అభ్యర్థుల లభ్యతపై సందిగ్ధత ఉందనే చర్చ జరుగుతోంది. అన్ని స్థానాల్లోనూ కచ్చితంగా పోటీ చేయాలని పార్టీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, అధికార కూటమి ప్రభుత్వంలో స్థానికంగా ఎదురుదెబ్బలు తగులుతాయనే ఆందోళన కొందరిలో ఉంది. అందుకే ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇష్టపడే అభ్యర్థులు కూడా కొంత కష్టంగానే కనిపిస్తారుఅభ్యర్థులను బలవంతంగా ఎంపిక చేసినప్పటికీ వారు ఖర్చు పెట్టుకునేందుకు ముందుకు రారు. అధికార పార్టీకి ధీటుగా తాము ఖర్చు చేయలేమని ముందుగానే చేతులెత్తాస్తారు. అది పార్టీ నియోజకవర్గ ఇన్ ఛార్జులకు భారంగా మారనుంది. ఆర్థిక భారాన్ని ఇన్ ఛార్జులు భరిస్తారా? లేక పార్టీ నాయకత్వం భరిస్తుందా? అన్న దానిపై స్పష్టత లేదు. దీంతో స్థానిక నియోజకవర్గాల ఇన్ ఛార్జులు మాత్రమే ఈ ఖర్చును భరాయించుకోవాల్సి వస్తే పోటీకి అయితే నిలబెడతారు కానీ, ఖర్చు మాత్రం ఎక్కువగా పెట్టరన్నది అందరికీ సత్యమే. ఖర్చు పెట్టని పరిస్థితుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ, అందులోనూ ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవడం అంత సులువు కాదు. అదే ఇప్పుడు వైసీపీకి మైనస్ పాయింట్ గా కనిపిస్తుంది. జగన్ కేంద్ర పార్టీ ఆఫీసులో కూర్చుని ఎన్ని ఆదేశాలు జారీ చేసినప్పటికీ చివరకు ఖర్చు చేయాల్సి రావడం లోకల్ లీడర్లే కావడంతో అంతగా సుముఖంగా ఉండరు. ఇవన్నీ వైసీపీ విజయాలకు బ్రేకులు వేస్తాయన్న విశ్లేషణలు మాత్రం జోరుగా వినిపిస్తున్నాయి

పెన్ పవర్
మంగళవారం 6 అక్టోబర్ 2026

# ఇండియా, వెస్టిండీస్‌కు బిగ్ షాక్.. రెండు జట్లకు ఐసీసీ భారీ జరిమానా



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా, వెస్టిండీస్ జట్లకు బిగ్ షాక్ తగిలింది. ఇటీవల ముగిసిన వన్డే సిరీస్?లో భాగంగా న్యూచండీగఢ్ వేదికగా జరిగిన చివరిదైనా మూడో వన్డేలో స్లో ఓవర్ రేటింగ్ కారణంగా ఇరుజట్లకు ఐసీసీ జరిమానా విధించింది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం ఇండియాకు 20 శాతం, వెస్టిండీస్?కు 10 శాతం మ్యాచ్ ఫీజులో కోత విధించారు. ఈ మ్యాచులో భారత్, వెస్టిండీస్ ఇరుజట్లు నిర్ణీత సమయంలోగా బౌలింగ్ కోటాను పూర్తి చేయలేదని ఆన్-ఫీల్డ్ అంపైర్లు జయరామన్ మదనగోపాల్, సామ్ నోగాజ్స్కీ, థర్డ్ అంపైర్ షర్ఫుద్దౌలా, ఫోర్త్ అంపైర్ వీరేందర్ శర్మ ఐసీసీకి ఫిర్యాదు చేశారు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, వెస్టిండీస్ కెప్టెన్ షై హోప్ ఇద్దరూ తమ తప్పును అంగీకరించారు. దీంతో ఎలాంటి అధికారిక విచారణ లేకుండానే మ్యాచ్ రెఫరీ ప్రకాష్ భట్ జరిమానా విధించారు.

ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం నిర్ణీత సమయం కంటే ఆలస్యంగా వేసే ప్రతి ఓవర్‌కు ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో 5 శాతం చొప్పున పెనాల్టీ విధిస్తారు. భారత్ నాలుగు ఓవర్లు, వెస్టిండీస్ రెండు ఓవర్లు ఆలస్యంగా వేసినట్లు తేలింది. దీంతో గిల్ సేనకు 20 శాతం, వెస్టిండీస్? ఆటగాళ్లకు 10 శాతం మ్యాచ్ ఫీజులో కోత పడింది.

**వన్డే సిరీస్ ఇండియా వశం..!**

భారత్, వెస్టిండీస్ మధ్య జరిగిన మూడు వన్డేల సిరీస్?ను టీమిండియా 2-1 తేడాతో దక్కించుకుంది. సిరీస్‌లోని తొలి రెండు వన్డేలను గెలిచిన భారత్ మూడవ వన్డేలో ఓటమి పాలైంది. న్యూ చండీగఢ్ వేదికగా జరిగిన చివరి వన్డేలో పర్యాటక జట్టు విజయం సాధించింది. కేఎల్ రాహుల్ సూపర్ సెంచరీ సాధించిన ఇండియా ఓటమి పాలైంది.

# 2027 ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ అత్యంత కీలకం: దినేశ్ కార్తీక్

- కెప్టెన్ గిల్‌కు రోహిత్ అనుభవం, సలహాలు ఎంతో ఉపయోగపడతాయన్న దినేశ్
- ఒత్తిడి సమయాల్లో గిల్.. రోహిత్‌పైనే ఆధారపడతాడని కార్తీక్ జోస్యం
- దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలో జరగనున్న 2027 ప్రపంచకప్
- వన్డేల్లో తనకు ఇంకా పని మిగిలి ఉందని రోహిత్ ఇటీవలే చెప్పిన వైనం




**హైదరాబాద్ పెన్ పవర్:** 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టుకు సీనియర్ ఓపెనర్ రోహిత్ శర్మ సేవలు అత్యంత కీలకం కానున్నాయని టీమిండియా మాజీ వికెట్ కీపర్-బ్యాటర్ దినేశ్ కార్తీక్ అభిప్రాయపడ్డాడు. రోహిత్ శర్మ అపారమైన అనుభవం, ప్రస్తుత ఫామ్ జట్టుకు అతిపెద్ద బలమని, ముఖ్యంగా యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు అతని మార్గదర్శకత్వం ఎంతో అవసరమని కార్తీక్ పేర్కొన్నాడు.వెస్టిండీస్‌తో జరుగుతున్న ప్రస్తుత సిరీస్‌ను దినేశ్ కార్తీక్ ఉదాహరణగా చూపించాడు. గువాహటిలో జరిగిన మ్యాచ్‌లో ఛేజింగ్ సమయంలో రోహిత్ శర్మ సాధించిన సెంచరీ అతని ఫామ్‌కు నిదర్శనమని ప్రశంసించాడు. ఆటలో ఎదురయ్యే తీవ్ర ఒత్తిడితో కూడిన పరిస్థితులను ఎదుర్కోవడంలో రోహిత్ అనుభవం గిల్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నాడు.ఈ విషయంపై కార్తీక్ మాట్లాడుతూ.. "ఒక కెప్టెన్‌గా, నాయకుడిగా ఆటలో ఉత్కంఠభరితమైన క్షణాల్లో రోహిత్ ఇచ్చే సలహాలు అమూల్యమైనవి. ముఖ్యంగా ఒక పెద్ద మ్యాచ్‌లో, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కచ్చితంగా రోహిత్ వైపే చూస్తాడని, అతనిపైనే ఆధారపడతాడని నేను భావిస్తున్నాను" అని స్పష్టం చేశాడు. సీనియర్ ఆటగాడిగా, మాజీ కెప్టెన్‌గా జట్టులో రోహిత్ పోషించే పాత్ర కీలకమని పేర్కొన్నాడు.కాగా, వన్డే ఫార్మాట్‌లో తనకు ఇంకా 'పని మిగిలి ఉంది' అని, 2027 ప్రపంచకప్‌లో ఆడాలనే తన కోరికను రోహిత్ శర్మ ఇటీవల బహిరంగంగా వెల్లడించాడు. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ మెగా టోర్నమెంట్‌లో ఆడటమే లక్ష్యంగా హిట్ మ్యాన్ ముందుకు సాగుతున్నాడు. వన్డేల్లో నిలకడగా పరుగులు సాధిస్తుండటంతో, రాబోయే ప్రపంచకప్ కోసం భారత జట్టు రూపొందించే ప్రణాళికల్లో రోహిత్ శర్మ కేంద్ర బిందువుగా కొనసాగుతున్నాడు.

# గంగూలీ కెప్టెన్సీలో టీమిండియా లక్ష్యం అదే.. సెహ్వాగ్ ఆసక్తికర వ్యాఖ్యలు



- గంగూలీ జట్టు లక్ష్యం విదేశాల్లో ఎక్కువ విజయాలేనన్న సెహ్వాగ్
- అప్పటి జట్టు ఆ లక్ష్యాన్ని సాధించిందని వ్యాఖ్య
- ప్రస్తుత టీమిండియా ఆటతీరుపై మాట్లాడలేనన్న సెహ్వాగ్
- మ్యాచ్ పరిస్థితికి తగ్గట్టే తన ఆట మార్చేవాడినని వివరణ
- అవసరమైతే రక్షణాత్మకంగా ఆడానని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:** సౌరవ్ గంగూలీ నాయకత్వంలో టీమిండియా ఎలా ఆడేదో మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ గుర్తు చేసుకున్నాడు. విదేశీ గడ్డపై వీలైనన్ని మ్యాచ్‌లు గెలవాలన్నదే అప్పటి జట్టు ప్రధాన లక్ష్యమని చెప్పాడు. ప్రస్తుత టీమిండియా ఆటతీరుపై మాత్రం తాను మాట్లాడలేనని స్పష్టం చేశాడు.'రైజ్ అండ్ ఫాల్' రెండో సీజన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా సెహ్వాగ్ ఐఏఎన్ఎస్‌తో మాట్లాడాడు. ఈ సందర్భంగా అప్పటి జట్టు ఆలోచనా విధానాన్ని వివరించాడు. "నేను దాదా నాయకత్వంలోని జట్టులో ఉన్నాను. కాబట్టి ఆ జట్టు ఆలోచనా విధానం గురించి చెప్పగలను. ప్రస్తుత జట్టులో నేను లేను. వారి ఆటతీరు గురించి నాకు పూర్తిగా తెలియదు. అందుకే దానిపై మాట్లాడలేను" అని సెహ్వాగ్ అన్నాడు.గంగూలీ నాయకత్వంలో తమ ప్రధాన లక్ష్యం అంతర్జాతీయ మ్యాచ్ లలో ఎక్కువగా గెలవడమేనని చెప్పాడు. విదేశీ గడ్డపై విజయాలు

సాధించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని తెలిపాడు. ఆ లక్ష్యాన్ని జట్టు సాధించిందని సెహ్వాగ్ గుర్తు చేసుకున్నాడు.తాను ఎప్పుడూ దూకుడుగా ఆడేవాడిని కాదని కూడా సెహ్వాగ్ గతంలో చెప్పిన విషయాన్ని ప్రస్తావించాడు. మ్యాచ్ పరిస్థితిని బట్టి తన ఆటతీరును మార్చుకునేవాడినని తెలిపాడు. అవసరమైనప్పుడు రక్షణాత్మకంగా కూడా ఆడానని చెప్పాడు.సెహ్వాగ్, సచిన్ టెండూల్కర్ ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ప్రమాదకరమైన ఓపెనింగ్ జోడీల్లో ఒకటిగా నిలిచింది. ఇద్దరూ కలిసి టీమిండియా ఎన్నో విజయాల్లో కీలక పాత్ర పోషించారు.'రైజ్ అండ్ ఫాల్' రెండో సీజన్‌కు సెహ్వాగ్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్నాడు. గత సీజన్‌లో ఈ బాధ్యతలు నిర్వహించిన అష్నీర్ గ్రోవర్ స్థానంలో అతడు వచ్చాడు. ఈ రియాలిటీ షోలో 15 మంది కంటెస్టెంట్లు 42 రోజుల పాటు పోటీపడతారు. అధికారాన్ని దక్కించుకోవడం, వ్యూహాలు, పొత్తులు ఈ ఆటలో కీలకంగా ఉంటాయి. ఈ షో అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్‌లో ప్రసారం అవుతోంది.

# వారణాసి.. ఎంత చెప్పాలో అంతే..



కలలు కనే డీప్-రెడ్ వెల్వెట్ లుక్‌లో యుక్తి తరేజా స్టన్స్



రాజమౌళి సినిమా అంటే షూటింగ్ మొదలైనప్పటి నుంచి రిలీజ్ వరకు ఒక ఐరన్ కాంపౌండ్ లాంటి సెక్యూరిటీ ఉంటుంది. బాహుబలి, ఆర్ఆర్ఆర్ టైమ్ లో ఎవరెంత మాట్లాడాలో ఆయన కంట్రోల్ లోనే ఉండేది. కానీ మహేష్ బాబుతో చేస్తున్న 'వారణాసి' ప్రాజెక్ట్ విషయంలో మాత్రం సీన్ పూర్తిగా రివర్స్ అయింది. సినిమా గురించి టీమ్ నుంచి చిన్న చిన్న అప్డేట్స్ రెగ్యులర్ గా బయటకు రావడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది.

ఈ సినిమా బ్యాక్ డ్రాప్ పై అసలు హింట్ మొదట రైటర్ విజయేంద్ర ప్రసాద్ నుంచే వచ్చింది. ఇది ఆఫ్రికన్ ఫారెస్ట్ నేపథ్యంలో సాగే అడ్వెంచర్ అని ఆయన చెప్పగా.. ఆ తర్వాత స్వయంగా రాజమౌళే గ్లోబ్ ట్రాటింగ్ అడ్వెంచర్ అంటూ ఒక క్లారిటీ ఇచ్చేశాడు. దీనికి తోడు మహేష్ బాబు కూడా ఆఫ్రికా షెడ్యూల్స్, అడవుల్లో షూటింగ్ ఎక్స్ పీరియన్స్ గురించి ఓపెన్ గా మాట్లాడటంతో సినిమా థీమ్ ఏంటనేది జనాలకు ఈజీగా అర్థమైపోయింది.

మరోవైపు ఎప్పుడూ తన పనేదో తాను సైలెంట్ గా చేసుకుపోయే సంగీత దర్శకుడు కీరవాణి కూడా ఈసారి తన పంథా మార్చారు. సినిమాలో మొత్తం ఆరు పాటలు ఉంటాయని, మ్యూజిక్ వర్క్ ఎంతవరకు వచ్చిందో కచ్చితమైన వివరాలు బయటపెట్టారు. గతంలో జక్కన్న సినిమాల్లో సాంగ్స్ కౌంట్ రిలీజ్ టైమ్ వరకు సస్పెన్స్ గానే ఉండేది. కానీ ఏకంగా 2027 సమ్మర్ రిలీజ్ టార్గెట్ అంటూ కీరవాణి ముందే ప్రకటించడం అందరినీ ఆశ్చర్యపరిచింది.ఇక యాక్షన్ ఎపిసోడ్స్ మీద రీసెంట్ గా ఎస్ఎస్ కార్తికేయ ఇచ్చిన హైప్ అంతా ఇంతా కాదు. ఆర్ఆర్ఆర్, బాహుబలిని మించేలా సీట్ ఎడ్జ్ యాక్షన్ ఉంటుందని ఆయన చెప్పగా.. తన క్యారెక్టర్ లో కూడా హెవీ స్టంట్స్ ఉంటాయని హీరోయిన్ ప్రియాంక చోప్రా ముందే ఒక క్లూ ఇచ్చింది. ఇలా టీమ్ లోని ఒక్కొక్కరు ఒక్కో పాయింట్ ను రివీల్ చేస్తుండటంతో, ప్రేక్షకుడి మైండ్ లో 'వారణాసి' కాన్వాస్ పై ఒక స్ట్రాంగ్ ఇమేజ్ క్రియేట్ అయిపోయింది.అయితే బయటపడుతున్న ఈ విషయాలన్నీ కథను డ్యామేజ్ చేసే లీకులు ఏమాత్రం కాదు. ఎవరెన్ని చెప్పినా మహేష్ మెయిన్ క్యారెక్టరైజేషన్, అసలు కాన్ఫ్లిక్ట్, స్టోరీలో వచ్చే మేజర్ ట్విస్టులు మాత్రం ఇంకా రాజమౌళి లాకర్ లోనే సేఫ్ గా ఉన్నాయి. దీన్ని బట్టి చూస్తే జక్కన్న ఈసారి కండిషన్స్ కు కాస్త బ్రేక్ ఇచ్చి, సినిమా బజ్ ను ఎప్పుడూ పీక్స్ లో ఉంచేలా పక్కా క్యాలిక్యులేటెడ్ గానే ఈ ఇన్ఫర్మేషన్ ను వదులుతున్నట్లు అనిపిస్తోంది.గతంలో రాజమౌళి సినిమాల చిన్న అప్డేట్ కోసం ఫ్యాన్స్ నెలల తరబడి వెయిట్ చేసేవాళ్లు. కానీ ఇప్పుడు గ్లోబల్ మార్కెట్ ను టార్గెట్ చేస్తున్న నేపథ్యంలో, సినిమా గురించి కంటిన్యూస్ గా బజ్ ఉండడం అవసరం. అందుకే రాజమౌళి లిమిట్స్ సడలించి, ప్రమోషన్ కు ఉపయోగపడే కంటెంట్ ను టీమ్ ద్వారానే బయటకు రప్పిస్తున్నారు. దీంతో వారణాసి పేరు ఎప్పుడూ ట్రెండింగ్ లో ఉండేలా మాస్టర్ ప్లాన్ వేశారని అర్థమవుతోంది.



హెబ్బా పటేల్ యొక్క రొమాంటిక్ రెడ్ గౌన్ లుక్ స్వచ్ఛమైన సొగసుగా ఉంది

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965